Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 321 | కరీంనగర్ | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## బహదూర్‌పల్లి స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం

**- సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్పు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చెల్,ఏప్రిల్9 : మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు

11 లో

## శంషాబాద్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 9 :గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. ఈగల్ టీం, పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో తరచూ డ్రగ్స్ పట్టుబడుతూనే ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టులో మరోసారి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు. గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో రూ. 4.6 కోట్ల విలువ చేసే 13.2 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి థాయ్ ఎయిర్ వేస్ ఫ్లైట్ లో వచ్చిన ప్రయాణికుడి బ్యాగ్ తనిఖీ చేయగా

11 లో





### అవసరం లేని గొల్లపల్లి

# రిజర్వాయర్ ఎందుకు

**- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతను ఎందుకు పూర్తి చేయలేదు...?**

**- సిఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు ప్రశ్న**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఏప్రిల్ 9 : పాలమూరు వలస జిల్లాగా మారటానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.30 వేల కోట్లు ఖర్చు చేసి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 80 శాతం పూర్తి చేశామని ఆయన చెప్పారు. మిగిలిన 20 శాతం పనులు చేయటానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావటం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండుంటే పాలమూరు జిల్లా ఇప్పటికే పూర్తిస్థాయిలో సస్యశ్యామలం అయ్యేదని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందన్నారు. కానీ, రేవంత్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు, కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు పిల్లి అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అవసరం లేని గొల్లపల్లి- చీర్కపల్లి రిజర్వాయర్ ఎందుకు నిర్మిస్తున్నారని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. జూరాల వద్ద పాలమూరు

11 లో

### జూన్ 2నుంచి స్కూల్

# విద్యార్థులకు అల్పాహారం

**- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం**

**- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం,ఏప్రిల్9 : కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని



ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను

11 లో

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

**- రాజకీయాల్లో నిఖార్సయిన నేత - జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కెటిఆర్ - జగిత్యాలలో జీవన్‌తో భేటీ**





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 9 : ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి

11 లో



### జీవన్‌రెడ్డిని కాంగ్రెస్

# అన్నివిధాల ఆదరించింది

**- గతంలో కెసిఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా**

**- పొంగులేటిపై ఆరోపణలు కాదు..దమ్మంటే చర్చకు రావాలి**

**- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్9 :మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని

11 లో

# పొంగులేటి కాదు..పొంగులూటీ

**- బాంబులు పేలుతాయన్న బాంబులేటి**

**- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు**

**- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు**

**- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు**

**- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఏప్రిల్ 9 : పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి

11 లో

# జీవన్ రెడ్డి పార్టీని వీడడం దురదృష్టకరం

**- అధిష్ఠానం పిలిచిచర్చిస్తే బాగుండేది: జగ్గారెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 9 : సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడడం బాధాకరమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమవ్వడంతో ఢిల్లీ నాయకత్వం చొరవ చూపి ఉంటే సమస్య పరిష్కారమయ్యేదని జగ్గారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాంపులపై కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ వచ్చిన ఆయన గులాబీ జెండా కప్పుకోనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి ఏఐసీసీ స్థాయిలో చర్చ అవసరమని పేర్కొన్నారు. జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ వీడడంపై ఆ పార్టీ సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉన్న జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం అని పేర్కొన్నాడు. కీలక నేత దూరమవ్వడంపై స్పందించిన ఆయన అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసి స్థాయిలో చెక్ చేసుకొని ఉండాల్సింది అని తెలిపారు.కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ తీరుతో అసంతృప్తిగా ఉన్న జీవన్ రెడ్డితో నేరుగా ఢిల్లీ నాయకత్వమే మాట్లాడి.. నేరుగా రంగం లోకి దిగి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేది అని ఆయన వెల్లడించారు. అయితే.. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని జగ్గారెడ్డి తెలిపారు. జీవన్ రెడ్డి పార్టీ మారడానికి గల కారణాలను బహిరంగగా మీడియాతో చెప్పలేమని.. అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

### తల్లిదండ్రులను

# చూసుకునే బాధ్యత పిల్లలదే

**- మంత్రి సీతక్క వ్యాఖ్యలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్, ఏప్రిల్ 9 : తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# రేవంత్ కన్నా..కెసిఆర్ పాలనే బెటర్

**- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్**

**- తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది**

**- జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్**

**- కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు**


**- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**- బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల,ఏప్రిల్9 :రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ

11 లో



# ఎమ్మెల్యే పాలనలో ప్రజల అసంతృప్తి

**- నాడు ఏడ్చిన మక్కాన్ సింగ్**
**- నేడు ప్రజలను ఏడిపిస్తున్నాడు**
**- దొంగ ఓట్ల నిర్మూలన కోసం**
**- బిఆర్ఎస్ శ్రేణులు పని చేయాలి**
**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 9 : రామగుండం లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పాలన ప్రజలందరు అసంతృప్తిగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు . నాడు ఎన్నికల సమయంలో దొంగ ఎడ్పులు ఎడ్చి అధికారం రాగానే నేడు ప్రజలను ఎడిపిస్తున్నడని ఆయన విమర్శలు గుప్పించారు.రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్ల నిర్మూలన బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం తీసుకున్న విధానాలకు కట్టుబడి కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.గోదావరిఖని మార్కండేయ కాలనీ లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ గురువారం జరిగిన రామగుండం నియోజకవర్గ విస్తృత స్దాయి సమావేశం ఆయన మాట్లాడారు. ఒక్క ఓటు దుర్వినియోగం అయినా ఆయా అభ్యర్థుల భవితవ్యమే మారుతుందని అన్నారు. రామగుండం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చనిపోయిన వారి ఓటు ఉన్నా, ఇక్కడి



నుండి వేరే చోటకు వెళ్ళినవారు ఉన్నా వారి ఓటును తొలగించే విధంగా అధికారులకు తెలియపర్చాలని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యే పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు తమ వద్దకు వచ్చి ఏడ్చి ఇప్పుడు తమను ఏడిపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ఈ ప్రాంతంలోనే ఉండకుండా తరిమికొట్టడానికి రామగుండం నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు . ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి మాజీ జెడ్పీటీసీ అముల నారాయణ, మురళీధర్ రావు, నాయకులు కౌశిక హరి నడిపెల్లి మురళీధర్ రావు మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ కార్పోరేటర్లు మేకల సమ్మయ్య యాదవ్ మేకల శారదా కరక పద్మ శ్రీనివాస్ రెడ్డి తోకల రమేష్ గుర్రం ముత్యాలు నాయకులు నారాయణదాసు మారుతి బోడ్డు రవీందర్ మెతుకు దేవరాజు, జెవి. రాజు, నూతి తిరుపతి, చెలుకలపల్లి శ్రీనివాస్ మేడి సదానందం కల్వచర్ల కృష్ణ వేణీ బాదె అంజలి ఇరుగురాళ్ల శ్రావన్ కోలుగూరి సాయి కుమార్ (చింటూ) పిల్లి రమేష్ గౌస్ బాబా కిరన్ జీ విరాలాల్ బుర్రి వెంకటేష్ కొడి రామకృష్ణ గుంపుల లక్ష్మి గుర్రం పద్మ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు



# అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 09 : స్థానిక టీఎన్జీవో భవన్‌లో గురువారం కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లను ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫోన్ల ద్వారా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సర్వే వివరాలు, పిల్లల సమాచారం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య డేటాను సులభంగా నమోదు చేయగలరని తెలిపారు. పోషణ అభియాన్ యాప్ వినియోగాన్ని వేగవంతం చేసి, సేవలను మరింత పారదర్శకంగా అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 17 మంది దివ్యాంగులకు రీట్రోఫిటెడ్ మోటార్ వాహనాలను అంద జేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రోత్ డ్రైవ్ నిర్వహించి, ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే పోషణ పక్షం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ సేవలను లబ్ధిదారులు పూర్తిగా వినియోగించుకోవాలని, స్మార్ట్‌ఫోన్లతో సేవల నాణ్యత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సరస్వతి, సీడీపీఓ సబిత, డీఎంహెచ్ఓ వెంకట రమణ, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ బృందం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.







# వయోవృద్ధులు, స్త్రీ, శిశు, మాత సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**- క్షేత్రస్థాయిలో అంగన్వాడి సేవల బలోపేతానికి మొబైల్ ఫోన్ల పంపిణీ**
**- మంత్రి దనసరి అనసూయ (సీతక్క).**
**- ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు పోషన్ పక్వాడ కార్యక్రమం జిల్లా నుండి ప్రారంభించిన మంత్రి**
**- రిటైర్డ్ ఉద్యోగులు వయోవృద్ధుల కోసం వెల్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి**
**- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వయోవృద్ధులు, స్త్రీ, శిశు, మాత సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. మహబూబాబాద్ పట్టణంలో కేంద్రం లో నూతనముగా ఏర్పాటు అయినా వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళి నాయక్, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మున్సిపల్ చైర్పర్సన్ జ్యోతిలతో కలిసి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లకు 1313 మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు, పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని జిల్లా నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ వృద్ధుల సంరక్షకులకు జీవనశైలి మెరుగుపడడం కోసం ఉపయోగపడుతుందని వారి యొక్క ఒంటరితనాన్ని మర్చిపోయి సంతోషంగా ఉండటం కోసం రూపొందించబడిన ఈ కేంద్రం ద్వారా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని వయోవృద్ధులు వివిధ క్రీడలలో పాల్గొనవచ్చని, తద్వారా మానసిక ప్రశాంతత ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, జిల్లాలో సుమారు 12 లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ కేంద్రం నిర్వహించడం జరుగుతుందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని, వారిని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వదిలేయడం తగదని సూచించారు.ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కేంద్రంలో టీవీ,దినపత్రికలు మ్యాగజీన్,పాటల పోటీలో క్యారమ్స్,చెస్ ఆటలు అందుబాటులో ఉంటాయని,వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో కేంద్రంలో ప్రథమ చికిత్స ఆరోగ్య సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి వారానికి ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉంటారని, వారి యొక్క ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మల్టీ గ్రైన్ ఆల్ఫా ఆహార పదార్థాలతో అందించడం జరుగుతుందని తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా వయవృద్ధులు గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు 1368 మొబైల్ ఫోన్ల పంపిణీ చేయడం జరిగిందని తద్వారా క్షేత్రస్థాయిలో డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలు పౌష్టిక ఆహారం,స్థితిగతులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేయడం పారదర్శకంగా పాలన కొనసాగుతుందన్నారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని మహబూబాబాద్ కేంద్రంగా ఈరోజు నుండి ప్రారంభించారు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు,ఆహార పంపిణీ అంశాలను నమోదు చేయవచ్చని,దీని ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.గర్భిణీలు,పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం పోషణ్ పఖ్వాడా కార్యక్రమం లక్ష్యమని,ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చరిత్రత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనసభలో వృద్ధుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరచినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మహబూబాబాద్‌లో డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని, రిటైర్డ్ ఉద్యోగులు వయవృద్ధుల కోసం ఇక్కడ వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని మంత్రి ని ఈ సందర్భంగా కోరారు.ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, శ్రీజిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,సభను ఉద్దేశించి ప్రసంగించి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో జిల్లా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు ముందుకు సాగుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో,రెవెన్యూ కె.అనిల్ కుమార్,జిల్లా వెల్ఫేర్ అధికారిని సబిత,సిడిపిఓలు శిరీష,సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రెడీ చేయండి

**- బ్యాలెన్స్ వర్క్స్ సత్వరమే పూర్తి కావాలి**
**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**
**- గాంధీనగర్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, ఏప్రిల్ 09 : డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బ్యాలెన్స్ వర్క్స్ సత్వరమే పూర్తి చేసి ఇండ్లను సిద్ధం చేసి ఉంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కరీంనగర్ లోని గాంధీ నగర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల బ్లాక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇండ్లకు సంబంధించిన పెండింగ్ పనులు ఏమేమి ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెన్స్ వర్క్ ను వెంటనే చేపట్టి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించారు. ఈ పనులపై ఆర్ అండ్ బి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. బ్లాక్ ల వారీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అన్ని రకాలుగా సంసిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ చారి, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడిన అంతర్గాం రెవెన్యూ ఇన్స్పెక్టర్

**- 10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 9 : పెద్దపెల్లి జిల్లా అంతర్గాం తాహశీల్ కార్యాలయంలో 10 వేలు లంచం తీసుకుంటూ గురువారం రెవిన్యూ ఇన్స్పెక్టర్ సేడంక శ్రీమాన్ ఏసీబీ బృందానికి పట్టుబడ్డారు. రాయదండి గ్రామానికి చెందిన మాచర్ల వెంకటస్వామి తల్లి మాచర్ల రాజమ్మ పేరు పైగల 5 1/2 ఎకరాల భూమి వారి కాస్థులో ఉండగా ఇదే గ్రామానికి చెందిన గుమ్మల చంద్రయ్య పేరుపైన ధరణిలో నమోదు అయింది. తిరిగి మాచర్ల రాజమ్మ పేరు పైన నమోదు చేసేందుకు ఆర్ఐ శ్రీమాన్‌ను వెంకటస్వామి ఆశ్రయించారు. ఆర్ఐ శ్రీమాన్ ఫీల్డ్ ఎంక్వయిరీ చేసి తాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్‌కు రిపోర్టు ఇవ్వడం కోసం వెంకటస్వామిని 10 వేలు ఆడిగారు. వెంకటస్వామి ఒప్పుకొని ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు కరీంనగర్ ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏసీబీ సిఐలు తిరుపతి పున్నమ్ చందర్ ప్రేమ్ కుమార్ ఆర్ఐ శ్రీమాన్ రైతు నుంచి 10వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీబి అధికారులు తెలిపారు. అంతర్గాం తహసిల్దార్ కార్యాలయంలో గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తాసిల్దార్లు ఆర్ఐ లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు దీంతో అంతగా తాసిల్దార్ కార్యాలయం అవినీతి కార్యాలయంగా మారిపోవడం చర్చనీయంగా మారింది.

# గ్యాస్ సరఫరా పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి

**- గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా సమన్వయంతో చర్యలు**
**- అడ్డంకులు తొలగిస్తూ పైపులైన్ పనులను వేగవంతం చేయాలి**
**- సీఎన్జీ స్టేషన్లు, డొమెస్టిక్, ఇండస్ట్రియల్ కనెక్షన్ల విస్తరణపై దృష్టి**
**- ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందనకు వ్యవస్థ బలోపేతం**
**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 09 : జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షణను బలోపేతం చేయడానికి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, డి.వేణు, డిసిపి రాంరెడ్డి తదితరులతో కలిసి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. కమిటీలో జిల్లా అటవీ అధికారి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ కమిషనర్, ఐఓసిఎల్ ప్రతినిధి సహా మొత్తం 14 మంది



సభ్యులు ఉంటారని వివరించారు. ఐఓసిఎల్ ఆధ్వర్యంలో జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో గ్యాస్ ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రామగుండంలో మూడు సి.ఎన్.జి స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రామగుండం-కరీంనగర్ మధ్య 50 కిలోమీటర్ల పైపులైన్ పనుల్లో 20 కిలోమీటర్లు పూర్తయ్యాయని, మిగిలిన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పైపులైన్ పనులకు అనుమతుల ఆలస్యం, రోడ్డు మరమ్మత్తు ఛార్జీలు, పని వేళల పరిమితులు వంటి అడ్డంకులను తొలగించి పనులను వేగవంతం చేయడం కమిటీ ముఖ్య బాధ్యతగా ఉంటుందని చెప్పారు. గ్యాస్ సరఫరా, నిల్వలు, పంపిణీలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు తక్షణ స్పందన కల్పించేలా వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ నరేందర్, ఆర్ అండ్ బి ఈఈ బావ్ సింగ్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, మనోహర్, జిల్లా అటవీ అధికారి శివయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలపై సమీక్షా సమావేశం


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 09 : సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఈ నెల 11న నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకల ఏర్పాట్లపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. యస్ఓ టు జీఎం కే.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ లైజన్ ఆఫీసర్ పెరుమాళ్ల శ్రీనివాస్‌తో పాటు బీసీ, ఓబీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జయంతి వేడుకలను అన్ని గనులు, విభాగాల్లో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచిం చారు. వేదిక ఏర్పాటు, అతిథులకు ఆహ్వానం, సభ నిర్వహణ, అధికారుల బాధ్యతల కేటాయింపు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్జీ-1 ఏరియాలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, బీసీ ఓబీసీ సెక్రటరీ బత్తుల పోషం, రాజేందర్, కె.మల్లేశం, సీనియర్ పిఓలు శ్రావణ్ కుమార్, హనుమంత రావు, ఏరియా వర్క్‌షాప్, సివిల్ అధికారులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల రైతులకు న్యాయం చేయండి

**- భూములు అందించిన ప్రతి రైతుకు వంద గజాలు కేటాయించండి..**
**- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్...**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పటాన్ చేరు, ఏప్రిల్ 9 : గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబరు 109 లో పరిశ్రమల స్థాపన కోసం భూములు అందించిన ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలని కోరుతూ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 109లో గల సుమారు 160 ఎకరాల భూమిని పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం సేకరించిన సమయంలో రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రతి ఒక్కరికి వంద గజాల నివాస స్థలం ఇస్తామని అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి సమక్షంలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్న నేటి వరకు ప్లాట్ల కేటాయింపు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాట్ల కోసం ఐదు ఎకరాల స్థలాన్ని గుర్తించిన విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

అయితే ఆ స్థలాన్ని కూడా పరిశ్రమలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలు తీసుకుంటే తీవ్రంగా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్లాట్ల కేటాయింపును త్వరితగతిన చేయాలని కోరారు. ఈ సమస్యపై అధికారులతో చర్చించి ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, వెంకట్రాంరెడ్డి, హుస్సేన్ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహనే సమాజ రక్షణ

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ - 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా భారీ అవగాహన ర్యాలీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 9 : ఎయిడ్స్ వంటి వ్యాధులపై సరైన అవగాహన కలిగి ఉండటం సమాజ రక్షణకు మొదటి అడుగని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. వ్యాధి గురించి తెలుసుకోవడం ద్వారా అపోహలు తొలగి, నివారణ సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం డా.బి.ఆర్. అంబేద్కర్ మైదానం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎయిడ్స్ నివారణే ఉత్తమ మార్గమని, సురక్షిత జీవన విధానమే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని అన్నారు. ప్రజలు వ్యాధి గురించి తెలుసుకోవడం ద్వారా అపోహలు, భయాలు తొలగుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు కట్టుబడి ఉందని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సురక్షిత జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో సరైన అవగాహన




కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. వ్యాధి వ్యాప్తి మార్గాలు, నివారణ పద్ధతులపై స్పష్టమైన అవగాహన ఉండాలని, అపోహలు, వివక్షలను తొలగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యాధిపై సరైన సమాచారం ప్రజలకు చేరవేయడం, నివారణపై అవగాహన పెంపొందించడం, బాధితుల పట్ల ఉన్న వివక్షను తగ్గించడం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# క్రిటికల్ కేర్ విభాగం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి. ఏప్రిల్ 9 : కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో 40 కోట్ల 50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మించబోయే 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం భవనం నిర్మాణం పనులకు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామాత్యులు దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, డిఎంహెచ్ఓ లలిత దేవి, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు హమీద్, పటేల్ నార్నె, శ్రీనివాసరావు, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీతో కలిసి శంకుస్థాపన చేసారు. శంకుస్థాపనం తర్వాత.. కొండాపూర్ హాస్పిటల్, డయాగ్నస్టిక్స్ హబ్‌ను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిఏసి చైర్మన్ గాంధీ సందర్శించారు. వైద్య సేవలు, ల్యాబ్ టెస్టులు, తదితర అంశాలపై పేషెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో రూ. 40 కోట్ల 50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మించబోయే 100 పడకల క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని మన నియోజకవర్గ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స కు అవసరయ్యే నాణ్యమైన వైద్యం అందించే దిశగా ముందడుగు వేస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అన్ని హంగులతో, సకల సౌకర్యాల తో నిర్మించి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ,నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని పనులు త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, మిషన్ భగీరథ ఇంట్రా గ్రిడ్ పంచాయతీ అధికారులతో కలిసి జిల్లాలో తాగునీటి సరఫరాపై గురువారం సమీక్షించారు.జిల్లా వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు.ఫిబ్రవరి 1 నుండి స్పెషల్ డ్రైవ్ చేసిన దానిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని అన్నారు.నీటి సరఫరా సమస్య ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు.గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.గ్రామాలలో,హ్యాబిటేషన్ లలో సరఫరా చేసేటువంటి నీరు నాణ్యతను పరిశీలించాలని అన్నారు.యాక్షన్ ప్లాన్ తయారు చేసి, గ్రామాల వారీగా ఏప్రిల్ 23 తరువాత ప్రతి పాఠశాలలోని నీటి ట్యాంకులను శుభ్రపరచాలని అన్నారు.పాఠశాలల్లో పైప్ లైన్ లీకేజీ ఏమన్నా ఉంటే వాటిని సరి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ



ఇళ్ల నిర్మాణం జిల్లాలో 4205 ఇందిరమ్మ ఇండ్లకు గాను సుమారు 795 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని,గ్రామాలలో,మున్సిపల్ ప్రాంతాల్లో పూర్తి కాని ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.అధికారులు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విసిట్ చేసి లబ్ధిదారులతో మాట్లాడాలని మార్కింగ్, బేస్ మెంట్ లెవల్, స్లాబ్ లెవల్ నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలని,ఎవరైతే ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయి నిర్మాణానికి ఆసక్తి లేని వారి పేర్లలో వేరే లబ్ధిదారులను చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఏ గ్రామంలోనైతే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు లబ్ధిదారుల ఎంపికకు ఆ గ్రామ కమిటీ ఆసక్తి గా లేకపోతే కొత్త కమిటీ ప్రతిపాదనలకు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్ద ఉద్యోగులు ఏ విషయంలో నైనా డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే క్షమించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్,ఇంట్రా అధికారులు కృష్ణారెడ్డి, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్ట్ కు అక్రిడేషన్ కార్డులు

**- ఈ నెల 12లోగా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోండి**

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, ఏప్రిల్ 9 : వనపర్తి జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో మీడియా అక్రిడేషన్ కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 239 ప్రకారం 2022లో జారీ చేసిన అక్రిడేషన్ కార్డుల గడువు ఈ నెల 30తో ముగియనుండటంతో, మే 1వ తేదీ నుండి రెండేళ్ల కాలపరిమితితో కొత్త అక్రిడేషన్ కార్డులను జారీ చేసేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు చెప్పారు. జర్నలిస్టులు ఏప్రిల్ 12, 2026 లోపు అవసరమైన అన్ని పత్రాలతో, ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆ తేదీ సాయంత్రం వరకు అందిన దరఖాస్తులను మాత్రమే మొదటి విడత అక్రిడేషన్ జాబితాలో పరిగణనలోకి తీసుకొని, జిల్లా కమిటీ ద్వారా పరిశీలించి అర్హులైన వారికి కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. గడువు తర్వాత అందిన దరఖాస్తులను రెండవ విడత జాబితాలో పరిశీలిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 09 : ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వచ్చే సోమవారం నుంచి, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమం నిర్వహణపై,సీఎస్ రామకృష్ణారావు,రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి,సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి,అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని,అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ట్రాఫిక్ నియమాలు,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించవలసిన అవసరం ఉందన్నారు. డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి,రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,ఎస్పీడి.బి శ్రీనివాసరావు అధికారులతో కలిసి పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 13 వ తేది నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 13వ తేదీన గ్రామీణ స్థాయిలో, గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తరచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఏమైనా ఉంటే గుర్తించి, ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని



పేర్కొన్నారు. వారం రోజులపాటు,ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగేలా విద్యార్థులచే ర్యాలీలు,మండల స్థాయి కార్యక్రమాలు,వాహన చోదకులకు కంటి పరీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. అన్ని కార్యక్రమాలలో ప్రజలను,ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున భాగ్యస్వామ్యం చేయాలన్నారు. జిల్లాఎస్పీ డి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమంలో పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు.ట్రాఫిక్ నియమాలపై ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితులు అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు

**- వేసవి సెలవుల్లో ఊర్లోకి వెళ్లేవారు పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలి**

**- భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 9 : భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీలో మార్చి 23, 2026న జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ కేసులో జింక నాగరాజు (సంకేపల్లి గ్రామం, వేములవాడ మండలం), బొబ్బిలి సదయ్య (గుంపుల గ్రామం, ఓదెల మండలం)లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించింది. ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణ సీఐ డి.నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తి ప్రజలకు సూచనలు చేశారు. వేసవికాలంలో సెలవుల కారణంగా ఊర్లకు వెళ్లే వారు తమ విలువైన బంగారు ఆభరణాలను వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలని సూచిం చారు. అలాగే, ఇంటిని ఖాళీగా వదిలి వెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా భద్రత చర్యలు మెరుగుపడతాయని తెలిపారు.

# కార్మికుల భద్రతే అత్యంత ప్రాధాన్యం - జీఎం (సేఫ్టీ) సాయిబాబు

**- కేటీకే-6 గనిలో 56వ సేఫ్టీ ఫోర్ట్‌నైట్ ప్రారంభం - ఇంటర్ ఏరియా ఫస్ట్ ఎయిడ్ పోటీలు నిర్వహణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 9 : కార్మికుల భద్రతే సంస్థకు అత్యంత ప్రాధాన్యమని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జీఎం (సేఫ్టీ) కె. సాయిబాబు పేర్కొన్నారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే–6 ఇన్‌క్లైన్ గనిలో బుధవారం 56వ వార్షిక సేఫ్టీ ఫోర్ట్‌నైట్ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్ ఏరియా ఫస్ట్ ఎయిడ్ పోటీలకు గని మేనేజర్ అనుగ్రహ నారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిబాబు మాట్లాడుతూ, గనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన ప్రాణాలను కాపాడగలదని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డీజీఎం ఎస్. సాయి ప్రసాద్, కో–కన్వీనర్‌గా డా. కె. ఉదయ్ కుమార్ (మెడికల్ ఆఫీసర్), సభ్యులుగా జి.మధుబాబు, ఎం.తిరుపతి (కేటీకే–1 గ్రూప్ ఏజెంట్), ఎం. రవీందర్ (ఏరియా సేఫ్టీ ఆఫీసర్) పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో వారు కీలక పాత్ర పోషించారు. ఫస్ట్ ఎయిడ్ పోటీలలో వివిధ ఏరియాల నుంచి వచ్చిన బృందాలు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించాయి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ పోటీల



లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా “సేఫ్టీ ఫస్ట్” అనే సందేశాన్ని కార్మికులకు మరింత బలంగా చేరవేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అనుగ్రహ నారాయణ్, సేఫ్టీ ఆఫీసర్ బి.మహేందర్, సంక్షేమ అధికారిణి దీప, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ శ్రీనివాస్, ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీ చిరుత లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం డీసీసీ నగర కమిటీకి అభినందనలు

**- ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**- నూతన పదవిదారుల సత్కారం-జెండా ఆవిష్కరణ, రక్తదాన శిబిరం నిర్వహణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 9 : డీసీసీ ఖమ్మం కార్పొరేషన్ నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరిని నూతనంగా ఎన్నికైన నగర కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీ నగర ఉపాధ్యక్షుడిగా పాలకుర్తి నాగేశ్వరావు, నగర కార్యదర్శులుగా గంగిశెట్టి శ్రీనివాసరావు, సంపటం నరసింహారావు, కోనేటి



నారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు దీపక్ చౌదరి వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేగినాటి ఉదయ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు రేఖ భార్గవి తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో ఎన్ఎస్‌యూఐ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కార్యకర్తలు రక్తదానం చేశారు. కేక్ కటింగ్ కార్యక్రమం కూడా నిర్వహించి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

# పూలే-అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి - జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 9 : మహాత్మా జ్యోతిరావు పూలే, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి సూచించారు. ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, 14న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల భాగంగా, భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో జరిగే వేడుకల ఏర్పాట్లపై గురువారం జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్వాహక కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 11న సాయంత్రం 4 గంటలకు జీఎం కార్యాలయం ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే, ఏప్రిల్ 14న ఉదయం 10 గంటలకు జీఎం కార్యాలయం మినీ ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం ఎస్. కవీంద్ర, ఏరియా ఇంజినీర్ మాల ఎర్రన్న, ఏజీఎం (సివిల్) వి. రవికుమార్, ఇన్‌చార్జ్ పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఎస్సీ లైజన్ ఆఫీసర్ ఎస్. చంద్రశేఖర్, ఎస్టీ లైజన్ ఆఫీసర్ బి. మోహన్, బీసీ లైజన్ ఆఫీసర్ మురళీమోహన్, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# ఒక యుద్ధం అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలిసి ప్రపంచాన్ని గందరగోళం లోకి నెట్టడమే కాకుండా ఒక రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధి తెరిచే చాలెన్జులుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జల సంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారి లోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగం లోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకు లను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమిం చడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరాన్ నేత కమేనీ మరణం చినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బ తీశారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందు కంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణా లు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతి న్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైట్, ఇరాక్, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్ తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబి గించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాలంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హోర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశా రు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబా పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికా విమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించి గలి గేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తి మంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉ నికిని కాపాడు కుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హోర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు.కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకో లేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలక మైన హోర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియం త్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# సమ్మె, సంక్షోభం, సంస్కరణలు... ఆర్టీసీ భవిష్యత్తు ఎటు ?



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనా పరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారితీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజిక-ఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామర మైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయ లకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను వలసిన విధంగా పెంచక పోవడం సంస్థకు భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వహణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచిత పాస్‌లు సంస్థ ఆర్థిక సంక్షో భానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయంబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోదవుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో దాదాపు 50,000 మంది కార్మికులు తమ హక్కుల కోసం వీరోచితంగా పోరాడారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి, దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది.

సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు, ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ (వాూ) తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. అలాగే పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చు కోవాలి. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్శిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50 నుండి 70 లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరుతోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలోమీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కువగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కాలపు కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను



ఏర్పాటు చేయాలి. అప్పుడే సమ్మెల వంటి తీవ్ర నిర్ణయాలకు తావుండదు. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. భావి తరాలకు భరోసా ఇచ్చేలా, సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం మరియు సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు, కానీ చర్చలు మరియు సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు కాకుండా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది.

ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 10 నుండి కార్మికులు చేపడుతామని చెపుతున్న సమ్మెను నివారించాలంటే ప్రభుత్వం మొండి వైఖరిని వీడి, కార్మికుల న్యాయమైన కోర్కెలను సానుకూ లంగా పరిశీలించాల్సి ఉంది. ఆర్టీసీని కాపాడుకోవడం అంటే సామాన్యుడి ప్రయాణాన్ని కాపాడుకోవడమే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం పాలకుల ప్రాథమిక బాధ్యత. బస్సు చక్రం ఆగిపోతే అభివృద్ధి కుంటుపడుతుంది, అదే చక్రం ప్రగతి పథంలో సాగితే సమాజం అంతా సుభిక్షంగా ఉంటుంది.

అందుకే ఆర్టీసీ భవిష్యత్తు అనేది కేవలం సంస్కరణలపైనే కాక, ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి, సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# అమెరికా ఆయుధ విషవలయంలో ప్రపంచం



విశ్వ జంపాల
7793968907

ప్రపంచ పటంలో తనను తాను 'ప్రజాస్వామ్య రక్షకురాలు'గా, 'శాంతి కాపలాదారు'గా చిత్రించుకునే అమెరికా అసలు రంగు యుద్ధం. అమెరికాకు ఆయుధమే ఆహారం, యుద్ధమే పెట్టుబడి.ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ చమురుతో కాదు, ఇతర దేశాల్లో చిందే రక్తంపై, ఆయుధాల అమ్మకాలపై ఆధారపడి నడుస్తోంది. శాంతి మంత్రం పైకి జపి స్తూనే, లోపల యుద్ధ తంత్రాన్ని నడిపే అమెరికా వైఖరి మానవ జాతికే ఒక కళంకం. "అమెరికా ఆయుధాలు తింటోం ది" అనేది నేడు ఒక చేదు నిజం. అంటే.. అది కేవలం లోహపు ముక్కలను మింగడం కాదు; కోట్లాది మంది అమాయకుల కలలను, పసిపిల్లల భవిష్యత్తును, స్వతంత్ర దేశాల సార్వభౌమత్వాన్ని పచ్చిగా నమిలి మింగుతోందని అర్థం. శక్తివంతమైన దేశంగా శాంతిని నెలకొల్పాల్సింది పోయి, యుద్ధమే పెట్టుబడిగా బతుకుతున్న తీరు ప్రపంచ మనుగడకే ప్రమాదకరం.

అమెరికాకు శాంతి అంటే ఒక నినాదం మాత్రమే, కానీ యుద్ధం అంటే ఒక భారీ లాభదాయకమైన వ్యాపారం. ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెట్టడం, ఆ మంటల్లో తన ఆయుధాల ఫ్యాక్టరీలను వేడి చేసు కోవడం ఆ దేశానికి వెన్నతో పెట్టిన విద్య. ఒక దేశంపై బాంబులు కురిపించాలన్నా, మరో దేశపు సార్వభౌమత్వాన్ని కాలరాయాలన్నా అమెరికాకు కావాల్సింది 'ప్రజాస్వామ్య రక్షణ' అనే ఒక అబద్ధపు సాకు. ఆ దేశపు క్షిపణులపై రాసి ఉండేది శాంతి సందేశం కాదు, రాబోయే వినాశనం తాలూకు ధర. అగ్రరాజ్యపు వైభవం వెనుక అమాయక దేశాల ఆర్తనాదాలు ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా, అది అమెరికా స్టాక్ మార్కెట్‌కు పండగే. శ్మశానాల మీద సౌధాలు నిర్మించుకునే వికృత ఆర్థిక వ్యవస్థ అమెరికాది. డాలర్ విలువ పెరగాలంటే మరో దేశం రణరంగం కావాల్సిందే. మధ్య ప్రాచ్యం నుంచి ఐరోపా వరకు అమెరికా వేసిన ప్రతి అడుగు వెనుక చమురు వేట, ఆయుధాల అమ్మకం తప్ప మానవత్వం ఎక్కడా కనిపించదు. మందుగుండు సామాగ్రిని అమ్మడం కోసం శత్రువులను సృష్టించడం, ఆపై మధ్యవర్తిగా నటిస్తూ ఇరుపక్షాల రక్తాన్ని పీల్చడం – ఇదే వాషింగ్టన్ అనుసరిస్తున్న అసలైన 'వ్యూహాత్మక భాగస్వామ్యం'.


అమెరికా యొక్క "మిలటరీ–ఇండస్ట్రియల్ కాంప్లెక్స్" (Military-Industrial Complex) అమెరికా అనుసరిస్తూన్న యుద్ధోన్మాద నగ్న సత్యాన్ని ఆవిష్కరిస్తూన్నాయి. ఆ దేశపు ఆర్థిక చక్రం రక్తం అనే ఇంధనంతో తిరుగుతుంది. అమెరికా విసిరే శాంతి కపోతం నోట్లో ఉండేది ఆలివ్ కొమ్మ కాదు... పేలడానికి సిద్ధంగా ఉన్న గ్రెనేడ్ పిన్. ప్రపంచ పటంలో అమెరికా గీసిన ప్రతి సరిహద్దు రేఖ వెనుక ఒక నెత్తుటి చారిక, ఒక తుపాకీ గొట్టం కచ్చితంగా ఉంటాయి. అమెరికాలో తుపాకీ గొట్టాలు ఆగితే, ఆ దేశపు వంటింట్లో పొయ్యి వెలగదు. యుద్ధం ఆగిపోతే ఆ దేశపు ఫ్యాక్టరీలు మూతపడతాయి, లక్షలాది మంది వీధిన పడతారు. అందుకే, తన దేశపు ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం కోసం ప్రపంచవ్యాప్తంగా స్మశానాలను నిర్మిస్తోంది అమెరికా. ఇరాక్ దగ్గర అణ్వాయుధాలు లేవని తెలిసినా, లక్షలాది మంది ప్రాణాలను బలి తీసుకున్న అమెరికాది 'ప్రజాస్వామ్య రక్షణ' కాదు, అది ఒక 'వ్యవస్థీకృత నేరం' (Organized Crime). తుపాకులతో చంపడం ఒక పద్ధతి అయితే, 'ఆర్థిక ఆంక్షల' పేరుతో దేశాలను ఆకలితో అలమటించేలా చేయడం అమెరికా అనుసరించే ఆధునిక ఉగ్రవాదం. వెనిజులా నుండి ఇరాన్ వరకు ఆ దేశం సృష్టించిన ప్రతి సంక్షోభం వెనుక తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలనే అహంకారమే కనిపిస్తుంది.

అగ్రరాజ్యానికి శాంతి అంటే నష్టం, యుద్ధం అంటే లాభం. ప్రపంచంలో ఎక్కడో ఒకచోట బాంబులు పేలితేనే వాషింగ్టన్ వీధు ల్లో డాలర్ల వర్షం కురుస్తుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు యుద్ధం అనేది ఒక 'లైఫ్ సపోర్ట్' లాంటిది; అది ఆగిపోతే ఆ దేశపు జిడిపి (GDP) వెంటిలేటర్ మీదకు వెళుంది. లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్ వంటి సంస్థల షేర్లు పెరగాలంటే, మరో దేశంలో పసిపిల్లల హాహాకారాలు వినిపించాలి. ఒక దేశపు స్మశాన వాటికలు అమెరికా ఆయుధ కర్మాగారాలకు ముడిసరుకును అందిస్తాయి. ఇది ప్రజాస్వామ్య రక్షణ కాదు, శవాల మీద పేలాలు ఏరుకునే వికృత వ్యాపారం.

అమెరికాకు సొంతంగా అభివృద్ధి చెందే సత్తా కంటే, పక్కవాడిని అస్థిరపరిచే కుతంత్రమే ఎక్కువ. శత్రువు లేకపోతే అమెరికా మనుగడ లేదు. అందుకే ఒకవేళ ప్రపంచంలో శత్రువు లేకపోతే, తన ఆయుధాలు అమ్ముకోవడం కోసం ఒక కొత్త శత్రువును తానే సృష్టించి, అతడిని ప్రపంచానికి విలన్‌గా పరిచయం చేస్తుంది. అమెరికా నేరుగా యుద్ధ రంగంలోకి దిగదు, కానీ యుద్ధం ఆగిపోనివ్వదు. దీనినే ఆ దేశం 'ప్రాక్సీ వార్' అని పిలుచుకుంటుంది. ఇతరులను ఎగదోసి తన ఆయుధాలను అమ్ము కుంటుంది. రష్యాను దెబ్బకొట్టడానికి ఉక్రెయిన్‌ను ఒక పావుగా వాడుకుంటూ, వేల కోట్ల విలువైన ఆయుధాలను సరఫరా చేస్తోంది. దీనివల్ల ఉక్రెయిన్ నాశనమవుతూ సంక్షోభంలో కూరుకుపోతున్నా, అమెరికా ఆయుధ కంపెనీల షేర్లు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి.

అమెరికా తన యుద్ధోన్మాదంతో ప్రపంచ దేశాలపై రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాయుధ, సాంకేతిక అణిచివేతలకు పాల్పడుతుంది. పెద్దన్న పాత్ర పోషిస్తున్న అమెరికా చర్యలు విశ్వ శాంతికి అతిపెద్ద విఘాతంగా మారాయి. అమెరికాకు యుద్ధం అనేది ఒక భావోద్వేగం కాదు, అది ఒక పక్కా వ్యాపారం. ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ చమురుతో కాదు, ఇతర దేశాల నుంచి చిందే రక్తంపై ఆధారపడి నడుస్తోంది. సుమారు ఏ800 బిలియన్లకు పైగా రక్షణ బడ్జెట్‌తో అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద సైనిక శక్తిగా ఉంది. ఇది మిగతా టాప్ 10 దేశాల బడ్జెట్ కంటే ఎక్కువ. ప్రపంచ ఆయుధ ఎగుమతుల్లో సుమారు 40% వాటా అమెరికాదే. లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్ వంటి దిగ్గజ సంస్థలు యుద్ధం జరిగితేనే పండుగ చేసుకుంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు సొంతంగా రక్షణ రంగంలో ఎదగకుండా అమెరికా అనేక ఆంక్షలు విధిస్తుంది. తద్వారా ప్రపంచ దేశాలన్నీ సాంకేతికత కోసం, విడిభాగాల కోసం తనపైనే ఆధారపడేలా (Dependence) చేసుకుంటుంది. ఒకసారి అమెరికా ఆయుధాన్ని కొంటే, ఆ దేశం ఇక దశాబ్దాల పాటు అమెరికాకు బానిసగా ఉండాల్సిందే. "సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పేరుతోనో, విడిభాగాల సరఫరా నిలిపివేత పేరుతోనో ఆ దేశాల విదేశాంగ విధానాన్ని అమెరికా శాసిస్తుంది. ఇది రక్షణ ఒప్పందం కాదు, ఒక దేశంపై రుద్దే 'డిజిటల్ మరియు మిలిటరీ బానిసత్వం'. ఇది కేవలం సాయుధ అణిచివేత మాత్రమే కాదు, ఇది ఒక దేశపు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక స్వేచ్ఛను హరించడం.

"మరో దేశపు స్మశాన వాటికలు.. అమెరికా కార్పొరేట్ సంస్థలకు లాభాల గనులు." సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య వైరాన్ని నిరంతరం సజీవంగా ఉంచడం ద్వారా పశ్చిమ ఆసియాలో నిరంతర చిచ్చు రగిలిస్తోంది. అక్కడ మంటలు ఆరిపోతే అమెరికా ఆయుధాల వ్యాపారం ఆగిపోతుంది, అందుకే ఆ మంటల్లో అమెరికా నిరంతరం నెయ్యి పోస్తూనే ఉంటుంది. తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అమెరికా 'శత్రువులను సృష్టించడంలో' సిద్ధహస్తురాలు. ప్రపంచ శాంతిని కాపాడాల్సిన ఐక్యరాజ్య సమితి (ఖచీ), నేడు అమెరికా చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. తన ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ తీర్మానాన్ని అయినా అమెరికా తన 'వీటో' అధికారంతో తొక్కిపెడుతుంది. లోకం మొత్తం ఒకవైపు ఉంటే, అమెరికా తన అహంతో మరోవైపు నిలబడి న్యాయాన్ని ఖూనీ చేస్తుంది. అణ్వాయుధ రాజకీయంలో అమెరికాది అందె వేసిన చెయ్యి. ఇతర దేశాలు అణ్వాయుధాలు తయారు చేస్తే 'ప్రపంచ వినాశనం' అని అరిచే అమెరికా, తన వద్ద మాత్రం భూగోళాన్ని వందల సార్లు బూడిద చేయగల మారణాయుధాలను పోగుచేసుకుంటోంది. తమ మాట వినని దేశాలపై 'ఆర్థిక ఆంక్షలు' విధించడం అమెరికా చేసే ఆధునిక ఉగ్రవాదం. బాంబులతో చంపలేని దేశాలను ఆకలితో చంపడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. ఒక దేశపు వెన్నెముక విరవడానికి ఆ దేశపు ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడం అమెరికా నిత్యకృత్యం. ఐక్యరాజ్యసమితి వేదికపై శాంతి గురించి ఉపన్యాసాలు ఇస్తూనే, తెర వెనుక ఏ దేశానికి ఎన్ని క్షిపణులు పంపాలో బేరసారాలు ఆడే ద్వంద్వ నీతి అమెరికాది. ఆ దేశం ఇచ్చే 'మానవతా సహాయం' కంటే, అది కురిపించే 'క్లస్టర్ బాంబుల' సంఖ్యే ఎక్కువ. అమెరికా బాంబులు కురిపిస్తే అది 'ఉగ్రవాద నిర్మూలన'. వేరే దేశం ఆత్మరక్షణ చేసుకుంటే అది 'ప్రపంచ ముప్పు'. ఇదీ అమెరికా అనుసరిస్తున్న వికృత మార్క్ నీతి సూత్రం! తాను అమ్ముకుంటే అది 'రక్షణ', ఇతరులు కొంటే అది 'తీవ్రవాదం'. ఈ ద్వంద్వ నీతే అమెరికా అసలు సిసలు దౌత్యం. ఇరాక్ నుంచి లిబియా వరకు అమెరికా చేసిన దాడులు మానవ హక్కుల




కోసం కాదు, కేవలం పెట్రో–డాలర్ ఆధిపత్యం కోసం. స్వతంత్రంగా ఆలోచించే దేశాల వెన్నెముక విరవడమే లక్ష్యంగా, ఆంక్షల పేరుతో ఆర్థిక ఉగ్రవాదాన్ని ప్రయోగిస్తున్న ఆధునిక సామ్రాజ్యవాది అమెరికా. అబద్ధమే పునాదిగా యుద్ధాలను నిర్మించడంలో అమెరికా ఆరితేరినది. ఇరాక్ అణ్వాయుధాల నుండి వియత్నాం గల్ఫ్ ఆఫ్ టోంకిన్ వరకు ప్రతి రక్తపాతం వెనుక ఒక పెద్ద అబద్ధం, ఒక భారీ ఆయుధ ఒప్పందం దాగి ఉన్నాయి. వినాశకరమైన ఆయుధాల కుప్పలపై కూర్చుని 'విశ్వశాంతి' గురించి ప్రసంగాలు దంచడం అంటే, నరరూప రాక్షసుడు అహింస గురించి మాట్లాడినట్లే ఉంటుంది. అగ్రరాజ్యాల ఆయుధ కర్మాగారాలు వెలగడం కోసం, మూడవ ప్రపంచ దేశాల వంటిళ్లలో దీపాలు ఆరిపోవాలా? మీ స్టాక్ మార్కెట్లు పెరగడం కోసం, మారుమూల దేశాల్లోని తల్లుల కడుపు కోత మిగలాలా?.

"శాంతి మంత్రం బయటకి... యుద్ధ తంత్రం లోపల! ప్రపంచ పటంలో అగ్రరాజ్యంగా వెలుగుతున్న అమెరికా వైభవం వెనుక కోట్లాది మంది అమాయకుల రక్తం ఉంది. ఆయుధాలు అమ్మడం కోసం శత్రువులను సృష్టించే అమెరికా తీరును ప్రపంచ దేశాలు ఎండగట్టాలి." "అగ్రరాజ్యం అమెరికా కురిపించేది ఆశీర్వాదాలు కాదు... అత్యాధునిక మారణాయుధాల మృత్యుఘోష. ప్రపంచ శాంతికి ఆ దేశం ఇచ్చే హామీ, రాబోయే యుద్ధానికి ఇచ్చే ఆహ్వానం లాంటిది." "లోకమంతా శాంతిని కాంక్షిస్తే, అమెరికా మాత్రం ఎక్కడో ఒకచోట యుద్ధం జరగాలని ప్రార్థిస్తుంది. ఎందుకంటే, ప్రపంచానికి యుద్ధం ఒక భయం.. కానీ అమెరికాకు అది ఒక విందు భోజనం!" తన ఉనికి కోసం శత్రువులను సృష్టించడం, తన లాభం కోసం మారణహోమాన్ని ప్రోత్సహించడం అమెరికా నైజం. అగ్రరాజ్యపు ఈ రక్తదాహం ఆగిపోనంత కాలం, ప్రపంచ పటంలో 'శాంతి' అనేది ఒక అక్షరం గానే మిగిలిపోతుంది.

"తుపాకీ గొట్టం ద్వారా వచ్చే శాంతి శ్మశాన శాంతి మాత్రమే. అది ఎప్పటికీ శాశ్వతం కాదు." దీన్ని అగ్రరాజ్యాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా, చైనాతో పాటు ప్రపంచ దేశాలన్నీ గుర్తుంచుకోవాలి. అగ్రరాజ్యాల వైభవం వెనుక ప్రపంచ దేశాల వినాశనం ఉంది. వారి విలాసాల వెనుక సామాన్యుల రోదనలు ఉన్నాయి. శాంతి అనేది బాంబుల మోత ఆగినప్పుడు వచ్చే నిశ్శబ్దం కాదు.. అది ప్రతి మనిషి భయం లేకుండా బతికే స్వేచ్ఛ. అగ్రరాజ్యాల అహంకారం అణిగి, ఆయుధాల హోరు తగ్గినప్పుడే.. విశ్వ మానవాళి శాంతి కపోతంలో స్వేచ్ఛను ఆస్వాధిస్తుంది. అధికారం కంటే మానవత్వం, ఆయుధాల కంటే సహజీవనం గొప్పవని ప్రపంచ దేశాలు గుర్తించి, అమెరికా సృష్టిస్తున్న ఆయుధ విషవలయం నుండి, 'సాంకేతిక బానిసత్వం' నుండి బయటపడినప్పుడే భూమిపై నిజమైన శాంతి వెల్లివిరుస్తుంది. ఆయుధాలు లేని ప్రపంచమే రేపటి తరానికి మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి!

వ్యాసకర్త : న్యాయవాది, విశ్వ సమాజం వ్యవస్థాపకులు.

# తల్లిదండ్రుల అవగాహనతోనే సమాజంలో మార్పు - కమిషనర్ సీతా దయాకర్ రెడ్డి

## - బాలల భద్రత, విద్య, ఆరోగ్యం అందేలా సమగ్ర చర్యలు - భద్రాద్రి కలెక్టర్ అంకిత్

## - చైల్డ్ రైట్స్ పై ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షా సమావేశం నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, బాలల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు బాలల హక్కులపై సమీక్ష సమావేశం గురువారం భద్రాద్రి జిల్లా ఐ డి ఓ సి కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరం లో నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కుల కమిషనర్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల అవగాహనతోనే సమాజంలో మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో మత్తు పదార్థాల నియంత్రణ, మరుగుదొడ్ల వినియోగం, బాల్య వివాహాల నివారణ, లింగ నిర్ధారణ కేసుల అరికట్టడంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి కమిషన్‌కు తెలియజేస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల ఎదుగుదలకు కీలకమని పేర్కొంటూ పోషకాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా ములకలపల్లి ధర్మన్న నగర్‌లో అంగన్వాడీ కేంద్రం లేకపోవడం గమనించామని, అటవీ శాఖ అనుమతుల సమస్యల కారణంగా పిల్లలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అవసరమైతే కంటైనర్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజన్ సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వ్యవసాయ కూలీల పిల్లల సమస్యల పరిష్కారానికి అంతర్రాష్ట్ర స్థాయిలో సమన్వయం అవసరమని తెలిపారు .జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, బాలల భద్రత, విద్య, ఆరోగ్యం అందేలా సమగ్ర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో బాలసదన్ ద్వారా పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని, 1098 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పిల్లల సమస్యలపై తక్షణ స్పందన అందిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ నుండి కళాశాల స్థాయి వరకు మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణతలో బాలికలు ముందంజలో ఉన్నారని, గిరిజన ఆశ్రమ పాఠశాలలతో పాటు అన్ని పాఠశాలల్లో పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 23 తరువాత బడిబాట కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లో డ్రాప్ అవుట్‌లపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో సికిల్ సెల్ అనీమియా నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి హెల్త్




క్యాంపుల ద్వారా కేసులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాల నివారణతో పాటు గంజాయి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన పోక్సో, బాల్య వివాహ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గిరిజన అటవీ ప్రాంతాల్లో గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాల ద్వారా గల్లంతైన పిల్లలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా 2023, 2024, 2025 సంవత్సరాలలో జిల్లాలో నమోదైన పోక్సో, బాల్య వివాహాలు తదితర కేసుల వివరాలను సమగ్రంగా వివరించారు. ఈ సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషన్‌కు వివరించారు. బాలల హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి బాలుడికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కట్టుబడి పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ద్వారా బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు, తీసుకోవలసిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కమిటీ మెంబర్లు కంచికచర్ల వందన గౌడ్, చందన, అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత, వచన్ కుమార్, భరత రాణి, సుమిత్ర దేవి, సాధిక్ భాష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, ఖమ్మం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజేత, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆవాస విద్యాలయాల తనిఖీలో లోపాలపై ఆగ్రహం

## ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీకి భద్రాద్రి కలెక్టర్ ఆదేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 8 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాతకొత్తగూడెంలో ఉన్న సమగ్ర శిక్ష పరిధిలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయం, పట్టణ బాలుర ఆవాస విద్యాలయం (యూఆర్ఎస్)లను గురువారం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ ఏడవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యాన్ని పరీక్షించిన కలెక్టర్, విద్యార్థుల ప్రదర్శన పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు సరిగా చదవలేకపోవడానికి గల కారణాలపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన కలెక్టర్, బోధనలో లోపాలు ఎందుకు ఉన్నాయో వివరణ కోరారు. పట్టణ స్థాయి పాఠశాల అయినప్పటికీ విద్యార్థుల సామర్థ్యం తక్కువగా ఉండటం ఆందోళనకరమని తెలిపారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, అవసరమైన సరుకులు తగినంతగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సరఫరాలో లోపాలు ఎందుకు ఉన్నాయో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత లోపాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కాంట్రాక్టు పద్ధతిలోనే విధులు నిర్వహిస్తున్నట్లు గమనించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం పడకుండా బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ పాఠశాలలో వీధి బాలలు, రక్షించబడిన బాలలు, డ్రాప్ అవుట్ బాలలు చదువుతున్నందున వారికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ అన్నారు . అయితే పర్యవేక్షణలో లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల నిర్వహణ, బోధన ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 9 : ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వచ్చే సోమవారం నుంచి, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమం నిర్వహణపై, సీఎస్ రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని, అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించవలసిన అవసరం ఉందన్నారు. డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13వ తేది నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 13వ తేదీన గ్రామీణ స్థాయిలో, గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తరచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఏమైనా ఉంటే గుర్తించి, ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వారం రోజులపాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగేలా విద్యార్థులచే ర్యాలీలు, మండల స్థాయి కార్యక్రమాలు, వాహన చోదకులకు కంటి పరీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. అన్ని కార్యక్రమాలలో ప్రజలను, ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున భాగ్యస్వామ్యం చేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమంలో పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఇఓ భోజన్న, డిఎంహెచ్వో రాజేందర్, జెడ్పీ సీఈవో శంకర్, డిసిఎస్ఓ రాజేందర్, డిపిఆర్ఓ విష్ణు వర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 12న మెగా మాక్ టెస్ట్ నిర్వహణ

## - రాత పరీక్షతో పాటు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహణ - ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - యువశక్తి ప్రోగ్రామ్‌లో మెగా మాక్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 09 : యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, పోలీస్ ఉద్యోగాల సాధనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం కలెక్టర్ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో "పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్" లో భాగంగా నిర్వహించనున్న మెగా మాక్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా యువత పోలీస్ విభాగంలో ఉద్యోగాలకు సన్నద్ధం కావడానికి ఈ మెగా మాక్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల విధానంలోనే రాత పరీక్ష నిర్వహించడంతో పాటు అభ్యర్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించే విధంగా ఫిజికల్ ఈవెంట్స్ కూడా నిర్వహించబడతాయని తెలిపారు. మెగా మాక్ టెస్ట్ ఈ నెల 12వ తేదీ ఆదివారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాత పరీక్షలో 1వ బహుమతిగా రూ.10,000, 2వ బహుమతిగా రూ.5,000, 3వ బహుమతిగా రూ.2,000, 4వ బహుమతిగా రూ.1,000 అందించడం జరుగుతుందని తెలిపారు. ఫిజికల్ ఈవెంట్స్‌లో కూడా బహుమతులు అందజేయబడతాయని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీలోగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949725997, 9573688952, 8333044460 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రతిభను నిరూపించుకొని పోలీస్ ఉద్యోగాల సాధనలో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (ఎక్స్ ఆర్మీ), యంగ్ ఇండియా మిషన్ సభ్యురాలు శ్వేత రెడ్డి, సిరిప్రియాదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల

## - నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

## - పనులు వేగవంతం చేయాలి - అధికారులకు ఆదేశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కొత్తగూడెంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో జరుగుతున్న లెవెలింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ ద్వారా భవనాల రూపకల్పన, విభాగాల వారీగా ఏర్పాటు చేయనున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందించనున్న తరగతి గదులు, లైబ్రరీలు, బ్లాక్ రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అత్యుత్తమ సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ జైలులో ప్రత్యేక వైద్య శిభిరం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


లక్షెటిపేట, ఏప్రిల్ 09 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం లక్షెట్టిపేట సబ్ జైలులో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత ఆదేశాల మేరకు స్పెషలిస్ట్ వైద్య నిపుణుల చేత ప్రత్యేక వైద్య శిభిరం నిర్వహించినట్లు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిభిరంలో కంటిపరీక్షలు, క్షయ వ్యాధి పరీక్షలతో పాటు షుగర్, బీపీ పరీక్షలు,చెస్ట్ ఎక్స్ రే, హెచ్ఐవి, హెపటైటిస్ బి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఆరోగ్య విద్య, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మానవ జీవనశైలితో వచ్చే మార్పుల వలన కలిగే వ్యాధుల వలన మరియు వ్యక్తిత్వ వికాసంపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిభిరంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు డాక్టర్ విద్య, డాక్టర్ వినోద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ శంకర్, డెమో బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ నాందేవ్, లింగారెడ్డి, హెచ్ఓ లు లక్ష్మణ్ స్వామి, దేవేందర్, ఐసీటీసీ ఆంజనేయులు, టీబీ సూపర్ వైజర్ సురేష్, హెల్త్ సూపర్ వైజర్ శోభ, ల్యాబ్ టెక్నీషియన్ అజీజ్ ఖాన్, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# పెబ్బేరు బైపాస్ వద్ద గంజాయి పట్టివేత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెబ్బేరు, ఏప్రిల్ 9 : పెబ్బేరు పట్టణంలో బైపాస్ దగ్గర ఉన్న బాలాజీ దాబా దగ్గర ఉదయం 10 గంటల సమయం ఇద్దరు వ్యక్తులు గాంజాయ్ అమ్మడానికి వస్తున్నట్టు సమాచారం రావడంతో పోలీస్ సిబ్బంది అలెర్ట్ అయి వెంటనే పెబ్బేరు తాహాసిల్దార్, ఇద్దరు గవర్నమెంట్ పంచులను పిలిపించుకొని క్లూస్ టీం వారి సహాయంతో అక్కడికి వెళ్ళి పదకొండు గంటలకి ఇద్దరు అనుమానితులను పట్టుకోవడం జరిగిందని వారినీ పట్టుకొని విచారించగా వారి పేర్లు ప్రవీణ్ కుమార్ మరియు బబ్లు కుమార్ సింగ్ అని వారి ఇద్దరిది బీహార్ రాష్ట్రం అని గత కొన్ని రోజులుగా బాలాజీ రైస్ మిల్ లో పని చేయుచున్నారని, వారి వద్ద ఒక్కొక్కరి నుండి రెండు చిన్న ప్యాకెట్ల గంజాయి దొరకగా ఒక్కొక్క ప్యాకెట్స్ సుమారు నాలుగు గ్రాములు,ఇద్దరి వద్ద నుండి నాలుగు ప్యాకెట్లు మొత్తం 16 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని,వారిని విచారించగా వారు ధీరజ్ ఠాకూర్ ఇతను షేరుపల్లి దగ్గర ఉన్న సప్తగిరి రైస్ మిల్లులో హమలిగా పని చేస్తూ అతని వద్ద ప్యాకెట్ 200 చొప్పున కొని అవసరం ఉన్న వారికి 400 చొప్పున అమ్మి లాభాలు పొందుతున్నారు అని వీరిద్దరిని తీసుకొని అక్కడికి వెళ్లి పట్టుకొగా 12 ప్యాకెట్ల గంజాయి సుమారు 48 గ్రాములు స్వాధీనం చేసుకొని అతన్ని విచారించగ అతను గత 45 రోజుల క్రితం బీహార్ నుంచి రణవీర్ అనే వ్యక్తి దగ్గర 250 గ్రాములు తీసుకొచ్చి ప్రవీణ్ మరియు బబ్లు సింగ్ ద్వారా అమ్మించడం జరిగిందని మొత్తంగా 64 గ్రాముల గంజాయి మరియు 3 మొబైల్ ఫోన్స్ ని స్వాధీనం చేసుకొని గతంలో వీరి వద్ద నుండి వై శాకాపూర్ గ్రామానికి చెందిన అజిత్ నాయుడు మరియు రాకేష్,పెబ్బేరుకు చెందిన వెంకటేష్ మరియు చింతకాయల శివ అనే నలుగురు వ్యక్తులు గాంజాయ్ వాడుతున్నట్లు వారు చెప్పడం జరిగింది అని తదుపరి ఆ నలుగురిని కూడా పట్టుకొని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ గారి ద్వారా హాస్పిటల్ పంపడం జరిగిందని ఎస్సై యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు.



# ఆర్జీ-2లో పూలే జయంతి ఏర్పాట్లపై సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 09 : సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో ఈ నెల 11న నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం, బిసి, ఒబిసి ఉద్యోగ సంక్షేమ సంఘాలు గురువారం ఆర్‌జీ-2 జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా జయంతి వేడుకల నిర్వహణకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి, ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. వేడుకలను విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం మాలోతు రాముడు, ఏజీఎం (పర్సనల్) పి.అరవింద్ రావు, ఏజీఎం (ఈ అండ్ ఎం) సుజన్ మెహ్రా, ఎస్ఈ (సివిల్) పి.బాలరాజు, బిసి, ఒబిసి లైజన్ ఆఫీసర్ వి.ఫణికుమార్, బిసి, ఒబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, సింగరేణి బిసి ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ ఎ.నవీన్ కుమార్, జె.రవిందర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



# కారుణ్య నియామకం క్రింద 8 మందికి నియామక పత్రాలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 : కారుణ్య నియామకం క్రింద 8 మందికి నియామక పత్రాలు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియామక పత్రాలు పొందిన వారు తమకు కేటాయించిన విధులను సమర్ధవం తంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, సంబంధిత అధికారులు తదిత రులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన ఆహారం అందించాలి

**- జిల్లా కలెక్టర్ హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 : ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు నాణ్యమైన బోదనతో పాటు రుచికరమైన మధ్యాహ్న బోజనము అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. గురువారం వాంకిడి మండలంలో బెండారా గ్రామములోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ అకస్మికంగా తనికి చేసి మద్యాహ్న భోజనం వంటశాలను, మూత్రశాలలు తరగతి గదులను, సందర్శించారు. ఈ విద్యార్థులకు నిర్వహిస్తున్న వార్షిక పరీక్షల తీరును పరిశీలిం చారు. కొందరు విద్యార్థులు గైర్హాజరు కావడాన్ని గమనించి ఉపాద్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో అనేక మౌలిక వసతులు కల్పిస్తున్న దని అన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని విద్యలో రానించాలన్నారు. గైర్హాజరౌతున్న విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడి బడికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోదనతో పాటు రుచికరమైన ఆహారాన్ని అందించాల న్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమ ములో ఉపాద్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# యూసుఫ్ పేటలో భజన ఆశ్రమానికి భూదానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 09 : పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో శ్రీశివరామ దీక్షితుల భజన ఆశ్రమ నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాతలు రెండు గుంటల భూమిని దానం చేసినట్లు భజన మండలి సభ్యులు డాక్టర్ అవుసుల నర్సింలు తెలిపారు.అదే గ్రామానికి చెందిన వడ్డేపల్లి జయరాం రెడ్డి తో పాటు బైండ్ల నారాయణ,అదృష్ట సోదరులు భూదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.కాగా ఆశ్రమ నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన ధాకారెడ్డిగారి మధుసూదన్ రెడ్డితో పాటు స్థానికులు ఆర్థిక సాయం అందజేశారని,ఇందుకు సహకరిం చిన దాతలకు స్థానిక సర్పంచ్ అనిత నరేందర్ రెడ్డి,శివరామ దీక్షితుల శిష్యులతో పాటు భజన మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నామినల్ మస్టర్ రోల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందహించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 9 : నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం అందిం చాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ లో, గురు వారం, ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా దినసరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. 2024-25 సంవత్సరానికి గాను 15 శాతం, 2025 - 26 సంవత్సరానికి 10 శాతం, 2026-27 సంవత్సరానికి 5 శాతం వేతనాలు పెంచారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినవారిమౌతామని కలెక్టర్ తెలి పారు. కార్మికులకు సంబంధిత వేతనములు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో శంకర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం "రామా"వరం వాసుల పాట్లు

**- నీటి సమస్యపై కార్పొరేటర్ సుప్రియ పరిశీలన**

**- కిన్నెరసాని పంపు హౌస్ సందర్శన - స్టాండ్‌బై మోటార్ ఏర్పాటు అవసరమని సూచన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి ప్రాంతం రామవరంలో గత వారం రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యపై 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ గురువారం కిన్నెరసాని పంపు హౌస్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. రామవరం కాంగ్రెస్ నాయకులతో కలిసి జరిగిన ఈ పర్యటనలో, పంపు ఆపరేటర్లు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాన్ని ఆమె గుర్తించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్యాంకుల్లో నిరంతరం నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని, మోటార్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పంపు హౌస్‌లో స్టాండ్‌బై మోటార్ లేకపోవడం గమనించిన సుప్రియ, ప్రధాన మోటార్‌కు తోడు స్టాండ్‌బై మోటార్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అప్పుడు మాత్రమే నిరంతర నీటి సరఫరా సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే, నూతనంగా నిర్మిస్తున్న మిషన్ భగీరథ ట్యాంక్‌కు రెండు 25 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రామవరం ప్రాంతంలోని వివిధ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

# చంద్ర రాజేశ్వర్‌రావు ధన్యజీవి

**- భూపోరాటాలకు నాందిపలికి మహనేత సిఆర్ - సిఆర్ ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు పునరంకితం కావాలి - సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా సిఆర్ 33 వర్ధంతి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 9 : దేశవ్యాప్తంగా భూపోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు ధన్యజీవి అని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణ చంద్రరావు అన్నారు. సిపిఐ అగ్రనాయకులు,మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సీఆర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. తొలుత సిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జమీందారి కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్శితుడై తన యావదాస్తిని పేదలకుపంపిణీ చేసిన మహనీయుడు చంద్ర రాజేశ్వర్ రావు అని కొనియాడారు. పేదలకు భూమి దక్కితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన సిఆర్ దేశవ్యాప్త భూపోరాటాలకు నాందిపలికారని, మహిళలపై దాడులు, అరాచకాలను, ఉద్యమాల అణచివేతకు పూనుకుంటున్న ప్రభుత్వాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉద్యమాల్లో పాల్గొనే ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఆరు దశాబ్దాల క్రితమే జనసేవాదళ్‌ను ఏర్పాటు చేసిన ముందు చూపు ఉన్న మహనేత సీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతికోసం అహర్నిషలు శ్రమించి అమరులైన నాటి నాయకులు చూపిన మార్గంలో పయనించి ప్రజా ఉద్యమాలను నిర్మించడమే వారికి ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు, నాయకులు కరీం, అల్లి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామారావు, సంజీవరావు, సయ్యద్ ఇర్ఫాన్, లక్ష్మి, మణి, పద్మ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోదాం వద్ద పటిష్టమైన బద్రత చర్యలు

**జిల్లా కలెక్టర్ హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, ఏప్రిల్ 09 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాం వద్ద పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాంను నెలవారి తనిఖిలో భాగంగా కలెక్టర్ సందర్శించారు. గేటుకు సీలుతో వేసిన తాళం సి. సి. కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎం గోదాం వద్ద సి,సి కెమెరాల పర్యవేక్షణతో పాటు పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం అధికారులు జమిల్ శ్యాంలాల్, ముసాఫిర్ హుస్సేన్ పాల్గొన్నారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ ఆవరణలో గల ఉద్యాన వనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌కు వివిధ పనుల కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందే లా నీడనిచ్చే చెట్లు, అవసరమైన పూల మొక్కలను పెంచాలన్నారు. పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో నీడనిచ్చే చెట్లు, పండ్ల మొక్కలను పెంచాలన్నారు. బారి వర్షాల వల్ల గుంతలు పడ్డ చోట మొరం వేసి చదును చేయాలనీ సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు "బహుజన గళం" కార్యక్రమం

**అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా కొమరం భీమ్ ప్రాంగణంలో "ధూమ్ ధామ్"**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 9 : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు బడుగు, బలహీన వర్గాలు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు వానపాకుల రాంబాబు అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా శుక్రవారం కొమరం భీమ్ ప్రాంగణంలో "ధూమ్ ధామ్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్, సిపిఐ నాయకులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేటర్ల సన్మానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక పట్టణ అధ్యక్షులు శివాటి మల్లేష్, ఉపాధ్యక్షులు గంగాధర సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లూరి సాంబశివరావు, భరత్ చంద్ర, ఇరుగు రాజు, మెంతిన సమ్మయ్యతో పాటు మహిళా నాయకురాళ్లు పూనెం సీత, నక్క లావణ్య, అనపర్తి పుష్ప, కొమరం సరస్వతి పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటాపురం అంకమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం.

**- అన్నదాన కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 9 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండలంలోని వెంకటాపురం గ్రామంలో అంకమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతు న్నాయి. ఈ సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు నిర్వహించారు. గ్రామంలోని యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తిరునాళ్లకు మరింత రంగు చేకూర్చారు. అంకమ్మ అమ్మవారి ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మేళతాళాలు, డప్పుల నినాదాల మధ్య అమ్మవారి ఉత్సవవిగ్రహాన్నిగ్రామ వీధు లలో ప్రదక్షిణగా తీసుకెళ్లగా



భక్తులు హారతులు సమర్పించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు సమిష్టిగా పాల్గొని మహోత్సవాలను విజయవంతం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించగా, వేలాది మంది ప్రసాదాన్ని స్వీకరించారు. మొత్తంగా వెంకటాపురం అంకమ్మ అమ్మవారి తిరునాళ్ళు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా కొనసాగి గ్రామ ప్రజల ఐక్యతను ప్రతిబింబించాయి.

# జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు అవకాశం

**జిల్లా ఉపాధి అధికారిణి మాధవి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 9 : తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి యన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నర్సింగ్ అభ్యర్థులకు విదేశీ ఉద్యోగావకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు, మొత్తం 90 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 30 లోపు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జూలై 8 నుండి 17 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి అని పేర్కొన్నారు. జియన్ఎం నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, వయస్సు 22 నుండి 38 సంవత్సరాల మధ్య ఉండాలని, జి యన్ ఎం అభ్యర్థులకు కనీసం 3 సంవత్సరాల అనుభవం అవసరమని తెలిపారు. అదేవిధంగా నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జర్మన్ భాషలో దీ1 స్థాయి వరకు శిక్షణ అందించబడుతుందని, ఏ2 స్థాయిలో 70 శాతం మార్కులు సాధించిన వారు తదుపరి దశకు అర్హులవుతారని, బి1 లేదా బి2 స్థాయి జర్మన్ భాష సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులను ఫాస్ట్ ట్రాక్ కార్యక్రమంలో పరిగణిస్తారని, పూర్తి చేసిన తరువాత జర్మనీలో ఉద్యోగ నియామకం జరుగుతుందని తెలిపారు.కనీస వేతనం గుర్తింపు పొందే వరకు 2300 యూరోలు (సుమారు ?2.2 లక్షలు), గుర్తింపు అనంతరం 2800 యూరోలు (సుమారు 3 లక్షలు) వేతనం నెలకు అందిస్తారని తెలిపారు. అదనంగా వసతి, ఆరోగ్య బీమా వంటి సదుపాయాలు కల్పించబడతాయని పేర్కొన్నారు.మరిన్ని వివరాల కోసం 9440051581, 9440049645, 9440052081 ఫోన్ నంబర్ల యందు సంప్రదించాలని, germanytriplewin2025@gmail.comకి ఏప్రిల్ 30 లోపు దరఖాస్తులను పంపవచ్చని జిల్లా ఉపాధి అధికారిణి మాధవి ఆ ప్రకటనలో సూచించారు.

# పోలీసుల భవనాలను పరిశీలించిన..రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటీ (గోదావరిఖని), ఏప్రిల్ 9 : రామగుండం పోలీస్ కమిషనరేట్ సాయుధ బలగాల అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ నూతన భవనాల నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అధికారులతో కలిసి పనులను గురువారం పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రారంభో త్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచిం చారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డి, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్ రావు, ఆర్ఐలు శేఖర్, రమేష్ ఉన్నారు.

# పేదోళ్ల ఇంటికల నిజం చేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 9 : కార్పొరేషన్ 28 డివిజన్ పరిధి విలేజ రామగుండంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఇల్లు లేని నిరుపేద అగ్గు లక్ష్మి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు 28వ డివిజన్ కార్పొరేటర్ దారంగుల కుమార్ రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరి ప్రసాద్ ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ఐలయ్య, బిల్ కలెక్టర్ వసంతరావు, పట్టణ కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షులు సాదు రమేష్ పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్కా ప్రసాద్, సాదుల శివ, పాకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# కొత్తగూడెంలో ఘనంగా రేగా కాంతారావు జన్మదిన వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : భద్రాద్రి-కొత్తగూడెం బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు జన్మదిన వేడు కలు కొత్తగూడెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని కెసిఆర్ కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పేద ప్రజలం దరి కోసం నిలబడుతుందని అన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు జన్మదిన సందర్భం గా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరావు, టౌన్ ప్రెసి డెంట్ మంతపురి రాజు గౌడ్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు ముత్యాల రాజేష్, సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడియా సత్యనారాయణ నాయక్ చుంచుపల్లి 2 యాకయ్య, బిఆర్ఎస్ కార్పొరేటర్ సింధు తపస్వి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దాము యాదవ్, సీనియర్ నాయకులు రాజేష్, తుంగారం సర్పంచ్ ప్రవీణ్ ప్రకాష్, సురేష్, అఖిల్ మహర్షి, 55వ డివిజన్ ఇంచార్జి ఇమంది గణేష్, 26వ డివిజన్ ఇంచార్జి డీకొండ సునీత, మైనార్టీ నాయకులు మునీర్, చల్ది రవి, చిన్న నాయక్, వరప్రసాద్, రామారావు, సోమ నాథ్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు శ్రీసీతారామ చంద్ర స్వామీ

**- కల్యాణ తలంబ్రాలు అందజేత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 09 : తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టిజిఆర్‌టిసి) రీజనల్ మేనేజర్ విజయ భాస్కర్, మెదక్ ఆర్టీసీ డిఎం సురేఖతో కలిసి గురువారం రోజు మెదక్ కలెక్టరేట్ కార్యాల యంలో జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా లో ఆర్టీసీ బస్సులలో మహాలక్ష్మి పథకం మహిళలకు సమర్థవంతం గా వినియోగించుకుంటున్న నేపథ్యంలో హర్షించదగ్గ విషయంగా కలెక్టర్ ఆర్టీసీ అధికారులను కొనియాడారు.

# ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కాంప్లెక్స్ హెచ్ఎం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 09 : ప్రాథమిక పాఠశాల గంపలపల్లిలో గురువారం జెండావెంకటాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు యశోదర సందర్శించి ఎస్ఏ2 పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించడం జరిగింది. అదేవిధంగా 2026-27 విద్యసంవత్సరానికి ముందస్తు బడిబాట ప్లాన్ చేసుకొని విద్యార్థుల నమోదుకు కృషి చేయవలసిందిగా ఉపాధ్యాయులకు తగిన సలహాలను సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సిఆర్పి ప్రణీత్ కుమార్, హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయురాలు మంజుల పాల్గొన్నారు.

# రాష్ట్ర అవార్డులకు భద్రాద్రి జిల్లా కలెక్టర్ సహకారమే మూలం

## ఆసుపత్రుల్లో ఎన్నో సవాళ్లకు పరిష్కారం చూపిన కలెక్టర్
## ఏజెన్సీ ప్రాంత వైద్య సేవల్లో ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా భద్రాద్రి జిల్లా
## ధన్యవాదాలు తెలిపిన ఆసుపత్రి సూపరింటెండెంట్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : ప్రజా పాలన ప్రగతి-ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ప్రదానం చేసిన అవార్డుల్లో సుమారు 20 శాతం అవార్డులు జిల్లా టీవీవీపీ ఆసుపత్రులకు దక్కిన సందర్భంగా ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు గురువారం భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాటి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ నుండి, నేటి జిల్లా కలెక్టర్ అంకిత్ వరకు సంపూర్ణ మద్దతు, సహకారం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని సూపరింటెండెంట్లు స్పష్టం చేశారు. వివిధ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, మంత్రి సూచించిన అంశాలను ముందుండి అమలు చేయడంలో కలెక్టర్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఆయన ముందడుగు, నిరంతర సహకారం సిబ్బందికి నైతిక బలం ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడిందన్నారు. సమయానుకూల ప్రణాళిక, ప్రోత్సాహం సిబ్బందిలో వృత్తి పట్ల నిబద్ధత పెంపొందించగా, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ దూరప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, వసతులు, ప్రమాణాల మెరుగుదలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపినట్లు పేర్కొన్నారు. గత ఒకటిన్నర సంవత్సరంగా దూరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి విస్తృత చర్యలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో రక్త నిల్వ కేంద్రాల స్థాపన, ఆపరేషన్ థియేటర్ల అభివృద్ధి, నిపుణులైన వైద్యులను ప్రోత్సాహకాలతో నియామకం, డయాలిసిస్ కేంద్రాల ఏర్పాటు, ఓపీడీ, ఆపరేషన్ థియేటర్ పరికరాల సమీకరణ, డిజిటల్ ఎక్స్-రే, ఈసీజీ యంత్రాల ఏర్పాటు, ఆసుపత్రుల మరమ్మత్తులు, పునరుద్ధరణ, సీసీ కెమెరాలు, తాగునీటి సౌకర్యాలు, డైట్, శానిటేషన్ సదుపాయాలు, వార్డుల్లో ఏసీలు, కూలర్లు తదితర మౌలిక వసతులు మెరుగుపరచబడినట్లు వివరించారు. ఈ చర్యల ఫలితంగా అవుట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రోగుల సంఖ్య గణనీయంగా



పెరిగి, ఆసుపత్రుల్లో పడకలు సరిపోని స్థితి ఏర్పడినట్లు తెలిపారు. ప్రసవాలు, శస్త్రచికిత్సలు భారీగా పెరిగి, టోటల్ నీ రీప్లేస్‌మెంట్, ల్యాపరోస్కోపిక్ వంటి స్పెషాలిటీ సేవలు విజయవంతంగా నిర్వహించబడుతున్నట్లు పేర్కొన్నారు. క్లిష్ట కేసులను స్థానికంగానే నిర్వహించడం వల్ల రిఫరల్ కేసులు గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. ఈ కృషికి రాష్ట్ర ప్రభుత్వం నుండి గతంలో సైతం గుర్తింపు లభించడంతో పాటు ఐటీడీఏ పీఓ, రాష్ట్ర టీవీవీపీ కమిషనర్, ఆరోగ్య కార్యదర్శి, ఆరోగ్య మంత్రి తదితర ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు అందినట్లు తెలిపారు. కొత్త గూడెం ఎమ్మెల్యే కూడా తెలంగాణ శాసనసభలో ఈ సేవలను అభినందించడం చారిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు జిల్లా కలెక్టర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ రామకృష్ణ, రామ్ ప్రసాద్, గౌరీ ప్రసాద్, హర్ష వర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాధ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కార్మికుల సమ్మెకు ట్రేడ్ యూనియన్ల మద్దతు...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు ఏప్రిల్ 9 : ములుగు జిల్లా కేంద్రంలో విద్యుత్ కార్మికుల సమ్మెకు తెలంగాణ ట్రేడ్ యూనియన్లు సంఘీభావం తెలిపారు. గురువారం విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిబాబా ఆధ్వర్యంలో ములుగు జిల్లా విద్యుత్ ఆర్టిజన్స్, కార్మికులు విధులను బహిష్కరించి రెండవ రోజు కూడా నిరసన తెలిపారు.ఇట్టి సమ్మెకు మద్దతుగా ట్రేడ్ యూనియన్ 327 జిల్లా నాయకులు డి రామచంద్రయ్య, వేణు,రాజేందర్ మరియు 1104 యూనియన్ కంపెనీ నాయకులు కె రంగారావు, ములుగు జిల్లా సిఐటియు నాయకులు సమ్మెకు సంఘీభావం తెలుపుతూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి, యాజమాన్యానికి, రాష్ట్ర నాయకత్వం తెలియజేయడం జరిగింది.సాయిబాబా మాట్లాడుతూ ఒకే సంస్థలో ఒకే సర్వీస్ రూల్స్ ఉండాలని వారు కోరారు,కానీ నిన్న జరిగిన చర్చల్లో విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క ఈ సమస్యలు 13వ తేదీన చర్చి స్తామని చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడెపు రాజు, నాగేశ్వరరావు, సురేష్ రెడ్డి ఆరోగ్యం,మహేందర్, తదితరులు పాల్గొన్నారు.





# రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ

- తేమ వచ్చిన 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు, మిల్లులకు తరలింపు
- అనధికార మిల్లర్లకు ధాన్యం పంపితే కఠిన చర్యలు
- హమాలి కార్మికులు, టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలి
- చిన్న రైతులకు ప్రాధాన్యం వివక్ష లేకుండా కొనుగోలు జరగాలి
- 24 గంటల్లో 100 శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలి
- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఎద్దపల్లి, ఏప్రిల్ 09 : జిల్లాలో రబీ (యాసంగి) ధాన్యం కొనుగోలును సమయానికి పూర్తి చేయడానికి సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ఆయన పాల్గొన్నారు. జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించి, ఏప్రిల్‌లో ప్రారంభించి మే నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అనధికార మిల్లర్లకు ధాన్యం పంపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో తగినంత టార్పాలిన్ కవర్లు, హమాలి కార్మికులను సిద్ధం చేయాలని తెలిపారు. ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని, ముఖ్యంగా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా 24 గంటల్లో మిల్లులకు తరలించాలని, గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అలాగే ట్యాబ్‌ల ద్వారా కొనుగోలు వివరాలను 24 గంటల్లో 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 14వ తేదీన అంబేద్కర్ జయంతి వేడుకలు

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
## ఐడీఓసీలో జయంతి వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 09: ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వ హించనున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎస్సీ సం క్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్న సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జయంతి వేడుకల పోస్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించను న్నామని తెలిపారు. జయంతి వేడుకలకు వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ఈనెల 13 నుంచి 18 వరకు "అరైవ్-అలైవ్"



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తు కాన్ఫరెన్స్ హాలులో నుండి ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లులతో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని తెలిపారు. వాహనాల సంఖ్య పెరగడం,అతి వేగంతో డ్రైవింగ్ చేయడమే ఈ ప్రమాదాలకు కారణమని పేర్కొన్నా రు. దీనిపై జిల్లా కలెక్టర్లు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలను కనుగోనాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి, వారాంతర "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవం తంగా అమలు చేయాలని సూచించారు.దీనిలో భాగంగా స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజల ప్రాణాలను రక్షించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సిఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ఇది పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులే బాధితులవుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు కూడా తెలిపారు. కార్యక్రమ షెడ్యూల్ వివరాలు ఈ సందర్భంగా విడుదల చేసారు. ఏప్రిల్ 13న గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రమాణం చేయించడం. ఏప్రిల్ 15న "చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే" నాలుగేళ్లకు పైబడిన పిల్లలకు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు. ఏప్రిల్ 16న ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు-హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగాన్ని ప్రోత్సహించడం, సోషల్ మీడియాలో అవగాహన సందేశాలు, ఫోటోలు పంచుకోవడం. ఏప్రిల్ 17న ప్రమాదాల అనంతరం తక్షణ సహాయం మెరుగుపరచడానికి "గోల్డెన్ అవర్" అత్యవసర స్పందన శిక్షణ కార్యక్రమాలు. ఏప్రిల్ 18న ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్ కార్యక్రమాలు-ప్రవర్తనా మార్పు, ట్రాఫిక్ నియమాల పాటించడంపై దృష్టి. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శి గౌరవ్ ఉప్పల్,జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, సిఐపిఆర్ ప్రియాంక, జిల్లా కలెక్టర్లు,పోలీస్ సూపరింటెండెంట్లు పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.




# రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి...

## మెరుగైన వైద్యం అందించాలి
## ఆరోగ్య అవగాహన కల్పించాలి
## కలెక్టర్ గరిమ అగ్రవాల్
## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ వారోత్సవాలు
## రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 09 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ట్రాన్స్ జెండర్స్ కోసం ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

## సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరి
## మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 09 : మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు గురువారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని,ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజలకు త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల పనితీరుపై ఎస్‌హెచ్‌ఓ మహేష్ నుండి వివరాలు తెలుసుకొని,సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు.ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఎస్‌పి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని హితవు పలికారు.అప్పగించిన విధులను సమయానికి పూర్తి చేయాలని,అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని,సామాజిక విఘాతం కలిగించే అంశాలపై ముందస్తు సమాచారం సేకరించేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటుచేయాలని సూచించారు.ఎస్పీ వెంట మెదక్ పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్,ఎస్సై ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి,ఎసైలు మల్లికార్జున్,విఠల్ సిబ్బంది ఉన్నారు.

# సినిమా న్యూస్



## మల్టీస్టారర్ లో 'హీరో' ఎవరు? మమ్ముట్టి ఆన్సర్ ఏంటంటే?



మల్టీస్టారర్ సినిమాల్లో హీరో ఎవరన్న చర్చ ఎప్పటికీ నిలిచిపోదు. అయితే ఆ ప్రశ్నకు మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టి ఇచ్చిన సమాధానం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. సోషల్ మీడియాలో కూడా వైరల్ గా మారింది. "ఇలాంటి సినిమాల్లో హీరో ఎవరన్నది ముఖ్యం కాదు, కథే అసలు హీరో" అంటూ ఆయన చెప్పిన మాటలు ప్రస్తుతం చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూలో యాంకర్.. కోలీవుడ్ దిగ్గజాలు రజనీకాంత్ - కమల్ హాసన్ కాంబినేషన్ లో వస్తున్న ఖఃఇ =ఖ గ్లింప్స్ ను ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. అందులో ఇద్దరు "ఎవరు హీరో?" అని దర్శకుడిని అడిగే సన్నివేశం గురించి ప్రస్తావించి, మీరు మోహన్ లాల్ తో కలిసి నటించినప్పుడు అలాంటి సందేహం వచ్చిందా అని అడిగారు. దీనికి స్పందించిన మమ్ముట్టి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించారు. "మేమిద్దరం కలిసి నటించినప్పుడు కథే ప్రధానంగా ఉంటుంది. మేం ఆ కథలో పాత్రలు మాత్రమే. ఎవరు హీరో అన్న భావన మాకు ఉండదు" అని అన్నారు. తమ మధ్య ఎలాంటి ఇగోలు లేవని, ఒకరి సినిమాల్లో మరొకరు నటించడం చాలా సహజమని కూడా తెలిపారు. మమ్ముట్టి ఇంకా మాట్లాడుతూ, "నేను మోహన్ లాల్ సినిమాల్లో నటించాను, ఆయన కూడా నా సినిమాల్లో నటించారు. మేం ఎప్పుడూ ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అనే ఆలోచన పెట్టుకోం. మంచి కథ ఉంటే కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంటాం" అని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు మల్టీస్టారర్ సినిమాలపై ఉన్న అభిప్రాయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు. ఇదిలా ఉంటే, సౌత్ లో అరుదైన కాంబినేషన్ గా భావిస్తున్న రజనీకాంత్ - కమల్ హాసన్ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. ఖఎఇ=ఖ అనే వర్కింగ్ టైటిల్ తో ఇటీవల విడుదలైన గ్లింప్స్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ చిత్రానికి జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. గ్లింప్స్ లో రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ స్టైలిష్ గా కనిపిస్తూ పోటాపోటీగా నిలిచారు. రజనీకాంత్ కారు కీ ఇవ్వడం, కమల్ హాసన్ డ్రైవింగ్ సీట్‌లో కూర్చోవడం వంటి షాట్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. చివర్లో "ఎవరు హీరో?" అనే ప్రశ్న సినిమాపై ఆసక్తి మరింత పెంచింది. మమ్ముట్టి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చూస్తే, ఆ ప్రశ్నకు సమాధానం ముందు స్పష్టంగా ఉందని చెప్పాలి. కథే ప్రధానంగా ఉండే ఇలాంటి చిత్రాల్లో నటీనటుల కంటే కంటెంట్ కే ప్రాధాన్యం ఉంటుందని ఆయన అభిప్రాయం. ఇదే విధానం కమల్ హాసన్- రజనీకాంత్ ప్రాజెక్ట్ లో కూడా కనిపించే అవకాశం ఉంది. మొత్తంగా.. ఇద్దరు లెజెండ్స్ కలిసి నటిస్తున్న సినిమా కథ ఆధారంగా ముందుకు సాగుతుందన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

## సమంత ఒక్కరోజు కూడా వదిలి ఉండలేదట!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి సమంత నటించిన ఫ్యామిలీ రొమాంటిక్ డ్రామా -ఖుషి-. ఈ మూవీ తరువాత వ్యక్తిగత సమస్యల కారణంగా కాస్త బ్రేక్ తీసుకున్న సమంత ప్రొడ్యూసర్‌గా, నటిగా మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో సినిమాలు చేయడం మొదలు పెట్టింది. నాగచైతన్యతో విడాకుల అనంతరం కొంత మానసిక ఒత్తిడికి గురైన సమంతా ఆ తరువాత -ది ఫ్యామిలీ మ్యాన్- సిరీస్ డైరెక్టర్లలో ఒకరైన రాజ్ నిడియోరుని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన సహకారంతో నిర్మాణ సంస్థని స్థాపించి చిన్న సినిమాలకు నిర్మాతగా సమంత శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న దర్శకుడు రాజ్ నిడిమోరుని వివాహం చేసుకన్న సామ్ కొత్త లైవ్‌ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే భర్త రాజ్ నిడిమోరుపై తన ప్రేమని వ్యక్తం చేసిన సమంత తాజాగా ఆసక్తికరంగా స్పందించింది. రాజ్‌తో భావోద్వేగ భద్రతను, నమ్మకాన్ని పొందానని వెల్లడించింది. అంతే కాకుండా తాజాగా మరింత ఆసక్తికరంగా స్పందించి ఆశ్చర్యపరుస్తోంది. నా జీవితంలో ఇన్ని సంఘటనలు జరిగిన తరువాత కూడా నేను ఒక మంచి మనిషిగా, ఒక ఉత్తమ నటిగా ఎదగడానికి కారణం నా భర్త రాజే- అంటూ స్పష్టం చేసింది. మేము ప్రతి పనిని కలిసే చేస్తాము. పని, వినోదం, వ్యాయామం కూడా. ఒక్క రోజు కూడా నేను అతనికి దూరంగా ఉండలేను- అంటూ ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. తన వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు తన జీవిత భాగస్వామి ఏ స్థాయిలో కీలక పాత్ర పోషించారో వివరిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది సమంత. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే -శుభం-లో చిన్న అతిథి పాత్ర లో మెరిసిన సమంత పూర్తి స్థాయి క్యారెక్టర్‌లో సోలో మూవీతో మూడేళ్ల విరామం తరువాత ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆమె నటించిన తాజా ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా -మా ఇంటి బంగారం-. రాజ్ నిడియోరు షో రన్నర్‌గా, సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ మూవీకి నందిని రెడ్డి దర్శకురాలు. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా మే 15న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. గుల్షన్ దేవయ్య, దిగాంత్ కీలక పాత్రల్లో నటించారు.

## ఇండస్ట్రీలో హీరో పేర్లపై నటుడి హాట్ కామెంట్స్!



ఇండియాపై ఇండియన్ పొలిటీషియన్స్ చేస్తున్న కుట్రలకు చెలించిపోయిన అజయ్ సన్యాల్ దీనిపై -ధురంధర్-లో ఓ డైలాగ్ చెబుతాడు. -హిందుస్థానియోంకా సబ్‌సే బడా దుష్మన్ హిందుస్థానీ హై పాకిస్థాన్‌తో దూస్రా నంబర్‌పర్ ఆతీహై.. - భారతీయులకు అతి పెద్ద శత్రువు భారతీయుడే..పాకిస్థాన్ ఆ తరువాత స్థానంలో ఉంటుందని..ఇక్కడ కొంత మంది మాటలు వింటే అదే నిజమనిపిస్తోందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా సెలబ్రిటీలు మైక్ పట్టుకుంటే చాలు కాంట్రవర్సీలు మాట్లాడేస్తూ వైరల్ అయిపోతున్నారు. ఆ తరువాత నెటిజన్‌లు, కోర్టులు చీవాట్లు పెట్టడంతో సైలెంట్ అయిపోయి తమ పని తాము చేసుకుంటున్నారు. తాజాగా ఓ నటుడు ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలే చేసి నెట్టింట ట్రెండ్ అవుతున్నాడు తననే కమల్ కామరాజు. దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి రూపొందించిన -అనుకోకుండా ఒక రోజు- సినిమాతో నటుడిగా కెరీర్ ప్రారంభించిన కమల్ కామరాజు ..జక్కన్న - ప్రభాస్‌ల -ఛత్రపతి-, శేఖర్ కమ్ముల - సుమంత్‌ల -గోదావరి- సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నాడు. అనీష్ కురువిల్ల ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేసిన -ఆవకాయ బిర్యాని- సినిమాతో హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ప్రయత్నించినా ఫలించకపోవడంతో అప్పటి నుంచి హీరో ఫ్రెండ్, సపోర్టింగ్ క్యారెక్టర్లు చేస్తూ వస్తున్నాడు. రీసెంట్‌గా పవన్ కల్యాణ్ నటించిన -ఉస్తాద్ భగత్‌సింగ్- మూవీలో కమల్ అనే ఆఫీసర్ క్యారెక్టర్‌లో నటించాడు. తాజాగా ఓ పోడ్ కాస్ట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల్ కామరాజు మాట్లాడుతూ తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోలకి ముస్లీం పేర్లు ఎందుకు పెట్టరు దీని గురించి ఎప్పుడైనా ఆలోచించారా అంటూ కీలక వ్యాఖ్యలు చేశాడు.

## నేహా శర్మ అందాల విందు.. ఫ్యాన్స్ ఫిదా



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన 'చిరుత' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన నేహా శర్మ, తన గ్లామర్‌తో మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. వయసు పెరుగుతున్నా కొద్దీ తన ఫిట్‌నెస్‌తో మరింత యంగ్‌గా, ఆకర్షణీయంగా కనిపిస్తూ కుర్రకారును మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ ఫోటోలతో పాటు ఆమె ఇచ్చిన క్రేజీ క్యాప్షన్ కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. నేహా శర్మ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలలో చాలా బోల్డ్‌గా కనిపిస్తోంది. ఆమె ధరించిన వెస్ట్రన్ డ్రెస్ తన గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేస్తోంది. ముఖ్యంగా తన టోన్డ్ లెగ్స్ కనిపించేలా ఆమె ఇచ్చిన స్టిల్స్ నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ఈ ఫోటోలకు ఆమె "వైల్డ్లీ డెల్యూషనల్.. అండ్ ఐ లైక్ ఇట్ లైక్ దట్" అంటూ ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే వేల సంఖ్యలో లైకులు, కామెంట్లు వచ్చి చేరాయి. ఆమె స్టైలింగ్ చూస్తుంటే ఫ్యాషన్ విషయంలో నేహాకు సాటి ఎవరూ లేరనిపిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు నేహా శర్మ అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'చిరుత' సినిమాతో ఆమె కెరీర్ గ్రాండ్‌గా మొదలైంది. ఇక మొదటి సినిమాతోనే తన అందం మరియు అభినయంతో తెలుగు వారి మనసు గెలుచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ అక్కడ బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. హిందీలో పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించినప్పటికీ, ఇప్పటికీ ఆమె తెలుగు సినిమాల్లో కనిపిస్తే చూడాలని మన ఆడియన్స్ కోరుకుంటూనే ఉంటారు. నేహా శర్మ ఇంత గ్లామరస్‌గా ఉండటానికి ప్రధాన కారణం ఆమె క్రమం తప్పకుండా చేసే వర్కవుట్స్. ఆమె ఒక కంప్లీట్ ఫిట్‌నెస్ ఫ్రీక్ అని చెప్పవచ్చు. ఇక ఆమె జిమ్‌లో కష్టపడుతున్న వీడియోలను, యోగా చేస్తున్న ఫోటోలను తరచుగా తన అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఇక సరైన ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్లే ఆమె తన బాడీని ఇంత పర్ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తోంది. అందుకే బీచ్ ఫోటోలైనా, స్టైలిష్ మోడ్రన్ డ్రెస్సులైనా నేహాకు చాలా చక్కగా నప్పుతాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో నేహా శర్మకు ఉన్న ఫాలోయింగ్ చూస్తుంటే ఆమె ఒక గ్లామర్ క్వీన్ అని ఒప్పుకోక తప్పదు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరియు బోల్డ్ ఫోటోషూట్‌లతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటోంది.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు మరొక ముందడుగు...

## బేటి బచావో-బేటి పడావో కింద కుట్టు యంత్రాల పంపిణీ, శిక్షణ ప్రారంభం...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 9 : జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు మరొక ముందడుగు పడింది. బేటి బచావో–బేటి పడావో పథకం కింద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, కుట్టు యంత్రాల పంపిణీతో పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో–బేటి పడావో పథకం కింద గురువారంసంగారెడ్డి స్థానిక బాలసదనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ఇటువంటి




కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బేటి బచావో–బేటి పడావో పథకం ద్వారా కుట్టు యంత్రాల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణలతో మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళలకు సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వనిత సంతోష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, డిసిపిఓ రత్నం, చిల్డ్రన్ సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్ ప్రీతీఅశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

### - వరి ధాన్య కొనుగోలు కంట్రోల్ రూమ్ ప్రారంభం
### - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, ఏప్రిల్ 9 : ములుగు జిల్లాలో రైతులు పండించిన గింజను కొనుగోలు చేస్తామని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. గురువారం యాసంగి (రబీ) 2025-26 సీజన్ కలెక్టరేట్ లోని సివిల్ సప్లై కార్యాయంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రబీ 2025-26 సీజన్ ప్రారంభమైన సందర్భంగా జిల్లాలోని వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు, రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు,ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం, రవాణా,మద్దతు ధర ఇతర సాంకేతిక ఇబ్బందులు తలెత్తినప్పుడు రైతులకు కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తుందని, సమస్యల ఫిర్యాదుల కోసం 9347416178 నంబర్‌ను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా పౌరసరఫరాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కృష్ణవేణి,డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి అవగాహన - ముందస్తు పరీక్షలు - స్టిగ్మా తగ్గించేందుకు భారీ ర్యాలీ




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : హెచ్ఐవి/ఎయిడ్స్ పై సమాజంలో అవగాహన పెంపు, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేయడం, వ్యాధిపై ఉన్న స్టిగ్మాను తగ్గించడం మరియు నివారణ చర్యలను బలపరచడం లక్ష్యంగా గురువారం మహబూబాబాద్ పట్టణంలో ఘనంగా అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా కోర్టు మహబూబాబాద్ నుండి ప్రారంభమై ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మహబూబాబాద్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు హెచ్ఐవి నివారణ, సురక్షిత జీవన విధానాలపై సందేశాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి పట్ల భయం అవసరం లేదని, సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్జున్ హెచ్ఐవి నివారణలో జాగ్రత్తలు,సురక్షిత చర్యలపై వివరించారు. నర్సింగ్ విద్యార్థులు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది, సర్వోదయ యువజన స్వచ్ఛంద సంస్థ సభ్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. అనంతరం జిల్లా కారాగారం లో హెచ్ఐవిల/ టిబి/ హెపటైటిస్ మొదలగు వాటిపైన ఖైదీలకు స్క్రీనింగ్ నిర్వహించబడింది. తదుపరి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేక హెల్త్ కాంప్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్,జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్,ఎస్‌యూవో వడ్డేబోయిన శ్రీనివాస్, హెచ్ఐవి ఎయిడ్స్ సిబ్బంది దిశ సారంగం, ఐసిటిసి' కౌన్సిలర్ రమేష్, వీరస్వామి, ఎస్ఎస్‌కే రమేశ్ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ శాంతారాజ్ వారి సిబ్బంది, వర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, లింక్ వర్కర్ సిబ్బంది కళాకారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నిశీపడమే ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 09 : పేదల జీవితాల్లో వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం చిన్న శంకరంపేట మండలం మడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, పేదల జీవితాలు వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని తెలిపారు. మండల పరిధిలోని మందాపూర్ రాంజీ తండాకు చెందిన మాలోత్ ప్రసాద్ కుమార్తె ప్రణయ్ శ్రీ 18నెలల అకస్మాత్తుగా నీటిలో పడి చనిపోగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సూరారంలోని మాజీ చైర్మన్ చింతల సత్యనారాయణ తండ్రి కొద్ది రోజుల క్రితం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల రక్షణపై కఠిన చర్యలు

### - అర్హులైన రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేయాలి
### - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 9 : ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో ఎలాంటి రాజీ ఉండదని, అన్యాక్రాంతం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ, కోర్టు కేసులు, కౌంటర్లు దాఖలు వంటి అంశాలపై రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, సింగరేణి తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా సంవత్సరాలుగా సాగు చేస్తున్నప్పటికీ భూ హక్కు పత్రాలు లేని భూముల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన రైతులను గుర్తించి సమగ్ర సర్వే నిర్వహించి భూ హక్కు పత్రాలు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నో ఏళ్లుగా భూమిని సాగు చేస్తున్నప్పటికీ హక్కు పత్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూమిని అమ్ముకోవడం సాధ్యం కాకపోవడం, పంట రుణాలు, రైతు భీమా, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు అందకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు భూ హక్కు పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, నిజమైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడమే కాకుండా అర్హులకు ఇండ్ల స్థలాలు, పట్టాలు పంపిణీ చేయాలని, మిగిలిన భూములను సోలార్ ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనకు వినియోగించాలని సూచించారు.



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన గడువులో సర్వే పనులు పూర్తి అయ్యేలా ఆర్డీవో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ భూముల సమస్యల పరిష్కారానికి సంయుక్త సర్వే నిర్వహించి హద్దులను ఖచ్చితంగా నిర్ణయించాలని తెలిపారు. సాగుచేస్తున్న రైతుల వివరాలను గ్రామసభల్లో ప్రకటించి, వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఇల్లందు ఎమ్మెల్యే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 8 : భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలోని బోడు పంచాయతీ కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సంఘం బేతంపూడి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ, మండల కేంద్రంలోనే కొనుగోలు కేంద్రం ఉండటం, మారుమూల ప్రాంతాల రైతులకు అందు బాటులో లేకపోవడం వలన, ధాన్యం రవాణాకు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నందున వారి సమీపంలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నేడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నామని, సబ్సిడీ మీద వ్యవసాయ పనిముట్లు,వడ్లకుబోనస్, మద్దతు ధర, కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్, మండలవ్యవసాయ అధికారి అన్నపూర్ణ, సీఈఓ చారి, బోడు సర్పంచ్ పొందెం స్వరూప,సర్పంచులు సురేష్, కోరం హనుమంతు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, పోషాలు,రమేష్, సర్దార్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల ముందు చూపు లేకనే కేటీకే6 ఇంక్లైన్ మూతపడనుంది

### - ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి సుధాకర్ రెడ్డి - ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్ కు మెమోరండం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 9 : సింగరేణి అధికారుల ముందు చూపు లేకపోవడం వల్లనే భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 6 గని మూతపడనుందని ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి గురుజ పెల్లి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. కెటికె-6 ఇంక్లైన్ గని మేనేజర్ కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పిట్ సెక్రటరీ శ్రీనివాస్ గని మేనేజర్ నారాయణకు మెమోరండం అందజేశారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, ఇంతకంటే ముందు దాదాపుగా 300 మందిని కేటీకే - 1 ఇంక్లైన్ కేటీకే-8 ఇంక్లైన్ కి డిప్యూటేషన్ మీద పంపించడం జరిగిందని మళ్లీ ఇప్పుడు సుమారు 100 మందిని డిప్యూటేషన్ పైపంపియడం జరుగుతుందని, మైన్ మూతపడే అవకాశం ఉందని, అది కేవలం సింగరేణి అధికారుల ముందుచూపు లేకపోవడం వల్లనే ఇతర గనులకు పంపుతున్నారని అన్నారు. గనిని కొన్ని సంవత్స రాలు నడపడానికి అవకాశాన్ని కల్పించాలని, కార్మికులను ఇతర గనులకు డిప్యూటేషన్ కు పంపించకుండా ఉండే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. గని డెవలప్మెంట్ కోసం కార్మిక సోదరులు ఏ పనిచేయడానికైనా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం, అశ్రద్ధ వహించకుండా గనిని డెవలప్మెంట్ చేయాలని కోరారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సుమారు 300 మంది కార్మికులు వివిధ గనులకు డిప్యూటేషన్ కు వెళ్లడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా సింగరేణి



అధికారులు యాజమాన్యం పున పరిశీలించి కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కలిసికట్టుగా రక్షణతో కూడినటువంటి వర్కింగ్ ప్లేస్ లను ఏర్పాటు చేసి కే టి కే-6 ఇంక్లైన్ మనుగడను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్ల ఇంచార్జ్ చంద్రమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ రాజన్న, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు గణేష్ రాంబాబు, సత్యనారాయణ, బ్రహ్మాచారి, షిఫ్ట్ ఇంచార్జీలు వేణు, రాంబాబు కనకయ్య, సిద్దయ్య, శ్రీధర్ మధుకర్, సేఫ్టీ, మైన్స్ కమిటీ ల సభ్యులు ,కార్యకర్తలు నాయకులు కార్మిక సోదరులు పాల్గొన్నారు.

# నాగపూర్ గ్రామంలో జల మహోత్సవ ర్యాలీ...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




సంగారెడ్డి ఏప్రిల్ 09 : సంగారెడ్డి మండలం నాగాపూర్ గ్రామంలో సర్పంచ్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికి మంచినీరు పేరుతో పంచాయతీ కార్యదర్శి జగన్ నిర్వహణలో మిషన్ భగీరథ అధికారుల ఆధ్వర్యంలో జల మహోత్సవ వేడుకను గ్రామంలో తిరుగుతూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన త్రాగునిరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు, అందరికి ఆరోగ్యానిచ్చే మంచి నీటిని ఏ విధంగా అందించాలి అనే విషయాన్నీ వివరించారు, మంచినీటికి సంబందించిన అన్ని విషయాలను ఎప్పటికపుడు అన్ని రాసుకోవాలని అన్నారు, ఈ సందర్బంగా సర్పంచ్ అశోక్ గౌడ్ ఉప సర్పంచ్ ప్రకాష్ రావ్ వార్డు సభ్యులతో మిషన్ భగీరథ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముకురాల అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రకాష్ రావ్ పంచాయతీ కార్యదర్శి జగన్, మిషన్ భగీరథ డిఈ హరీష్, ఏఈ వెంకటేష్ వార్డు సభ్యులు చింతల కీర్తన, కట్కం భాగ్యమ్మ, కాశీపూరం విజయలక్ష్మి, శ్యామల, కట్కం మధు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు...

# అపోహలు పోవాలి... అవగాహన పెరగాలి..!

### జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ గోపాలరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


ములుగు, ఏప్రిల్ 9 : రక్త మార్పిడి, అసురక్షిత శృంగారం వంటి కారణాల వల్ల ఎయిడ్స్ ఒక్కరినుంచి మరొకరికి వ్యాపిస్తుందని తెలిసిందే!అయితే వ్యాధిపట్ల కొంతమందిలో ఉండే కొన్ని అపోహలు,సందేశాలు శారీరకంగానే కాదు,మానసికంగా వారిని కుంగదీస్తున్నాయి. ఈ అపోహలని తొలగించి వ్యాధిపై పూర్తి అవగాహనపై పెంచడం కోసం జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -99 రోజుల కార్యక్రమంలో హెల్త్- వీక్ లో భాగంగా హెచ్ఐవి పై అవగాహన కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు ,జి జి హెచ్ ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ జండా ఊపి రాలిని ప్రారంభించారు. జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, పరీక్షల, నివారణ చర్యలు, కౌన్సిలింగ్ సెంటర్లు మరియు చికిత్స గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యవంతులను చేయాలని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో ప్రజలు, ప్రజాప్రతి




నిధులు, యువజన సంఘాలు స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఈ వ్యాధిని వారించవచ్చునని వివరించారు. గ్రామాలలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురించి గ్రామసభలలో మాట్లాడాలని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి అనేది ఒక వైరస్ వల్ల ఒకరి నుండి ఇంకొకరికి హెచ్ఐవి వైరస్ కలిగిన రక్త మార్పిడి వల్ల, కలుషితమైన సిరంజిల వల్ల సురక్షితం కానీ సంభోగం వల్ల వల్ల ఒకరి నుండి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందని, కరచాలనము వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగనేష్, మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్పతి,ఫిజీషియన్ డాక్టర్ బిక్షపతి రావు,నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధా,భాస్కర్, జ్యోతి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు

### రెండవ రోజు ఆర్టిజన్ల నిరవధిక సమ్మె



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 09 : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ మెదక్ డివిజన్ విద్యుత్ కార్యాలయం ముందు రెండవ రోజైన గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి విఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ లు మాట్లాడుతూ ఆర్టిజన్లకు నిబంధనల ప్రకారం ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, 2026 పిఆర్సి,మెడికల్ లీవులు మంజూరు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గ్రేడ్ చేంజ్ పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతంతో జీవితాలను నెట్టు కొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనారాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం కల్పించుకుని తమకు రావాల్సిన న్యాయ పరమైన హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు ప్రణీత,స్వప్న, జ్యోతి,సుమలత,మానస,నాగమణిజెఏసి నాయకులు జంగం శరత్, పృథ్వీ గౌడ్,శ్రీశైలం శ్రీనివాస్, నాగరాజు, రమావత్ హరినాయక్, వెంకట చారి, సత్యంగుప్తా, మొగులయ్య, రాజు గౌడ్, శంకరప్ప, పరశురామ్, ఫోల్కంపేట వేణుగోపాల్, నర్సింలు, సుధాకర్, సాయిలు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. రెండవ రోజు డివిజన్ కార్యాలయం ముందు కార్మికుల వంటా వార్పు కార్యక్రమం కొనసాగింది.



# రామగుండం లో బిఎల్ఓ విధులకు రాజీనామా

## దూర ప్రాంతాల్లో విధులు ఆర్పీలపై ఆర్థిక భారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 9 : రామగుండం నియోజకవర్గంలో బూతు లెవెల్ అధికారులుగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్పీలు 2016 నుంచి వారికి అనుకూలమైన ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా వారిని రెవెన్యూ అధికారులు కొంత మంది ఆర్పీలను దగ్గరి ప్రాంతం నుండి దూర ప్రాంతాలకు పంపడం వల్ల ఆర్పీలపై ఆర్థిక భారం పడుతుంది. ఆర్పీలు ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఇప్పించేందుకు తమ విధులను నిర్వర్తించడం జరుగు తుంది. ఇది కాకుండా అదనంగా ఆర్పీలు బిఎల్ఓ విధులు అదనంగా చేయడం జరుగు తుంది. ఆర్పీలు స్వంతంగా డబ్బులు పెట్టుకుని రవాణా భారాన్ని మోయడం వల్ల వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆర్పీలకు గౌరవ వేతనం కూడా రూ. 6 వేలు మాత్రమే ఉంది. అదనంగా బిఎల్ఓలుగా పని చేస్తున్న ఆర్పీలకు ప్రభుత్వం ఎలాంటి రవాణా ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. దాంతో దూర ప్రాంతాలకు బిఎల్ఓలుగా ఆర్పీలు వెళ్ళేం దుకు సుముఖంగా లేరు, కొంత మంది అధికారులు ఆర్పీలను దూర ప్రాంతాలకు వెళ్ళాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నందున 114 మంది ఆర్పీలు బిఎల్ఓలుగా విధులు నిర్వహించలేమని పేర్కొంటూ రాజీనామా చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి దూర ప్రాంతాలకు బిఎల్ఓలుగా ఆర్పీలను పంపకుండా దగ్గర ఉన్న ప్రాంతాలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్పీలు కోరుతున్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 09 : ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద నాలుగో రోజు ఎయిడ్స్ పై అవగాహన, నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,అదనపు కలెక్టర్ నగేష్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత,డిసిహెచ్ఎస్ శివ దయాల్,నర్సింగ్ కాలేజ్ బాలికలు హాజరై, ఈరెడ్ రన్ వాకథాన్ ర్యాలీనిజెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈనేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి రామ్ దాస్ చౌరస్తా వరకు వరకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ ఒక నివారించలేని వ్యాధి అయినప్పటికీ,సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్తం, వాడిన సిరంజీల ద్వారా ఈవ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులను పాటిస్తూ,జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో కూడా (385) హెచ్ ఐవిఎయిడ్స్ కేసులు) బాధితులకు జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వఆస్పత్రిలో గల ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈమేరకు బాధితులు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. రాందాస్ చౌరస్తాలో ఎయిడ్స్ నివారణపై అదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఎటువంటి భయోందాలకు గురికాకుండా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించుకోవాలని పాజిటివ్ అని నిర్ధారణ అయితే తగు జాగ్రత్తలు తీసుకుంటూ హెచ్ఐవి వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని కోరారు. ర్యాలీలో వైద్య అధికారులు,ఆశాలు,సిబ్బంది, వైద్య విద్యార్థులు,నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతిలో ప్లకార్డులు పట్టుకొని "ఎయిడ్స్ నివారణ" నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్,ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు,ఆశాలు,వైద్య విద్యార్థులు,నర్సింగ్ విద్యార్థులు,ఆరోగ్య శాఖ సిబ్బంది,ఎన్జీఓలు, తదితరులు పాల్గొన్నారు.



# సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన రాజేశ్వరరావు

### - ఖనిలో 'చంద్ర' వర్ధంతి కార్యక్రమం
### - సిపిఐ నగర కార్యదర్శి కె. కనకరాజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 9 :సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసిన ఆదర్శ మూర్తి చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ నగర కార్యదర్శి కె .కనక రాజ్ అన్నారు. సిపిఐ అగ్రనేత సి ఆర్ 32వ వర్ధంతి సందర్భంగా గురు వారం గోదావరిఖని పట్టణం భాస్కర్ రావు భవన్ లో చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు క గౌసిక మోహన్, గౌతం గోవర్ధన్ ఏఐటి యుసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,కేంద్ర కార్యదర్శి కే.స్వామి, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు వేల్పుల నారాయణ లు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం పట్ల అంకిత స్వభావం కలిగిన వాడిగా ప్రజలందరికీ చంద్ర రాజేశ్వరరావు ఆదర్శనీయుడని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి అనేక మంది యువతీ, యువకులకు జనసేవా దళ్ శిక్షణ ఇచ్చారని అన్నారు. అనేక దేశాలు తిరిగి కమ్యూనిస్టు యోధులను కలిశారని ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన లెనిన్ అవార్డ్ ను పొందారని తెలిపారు.సిఆర్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు తాల్ల పెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, మడికొండ ఓదెమ్మ, కన్నం లక్ష్మి నారాయణ, టి.రమేష్ కుమార్, సిరిసిల్ల మల్లేష్, ఎం ఏ గౌస్, రెంటాల లింగయ్య, ఈశ్వర్, దుబాసి రేణుక, బూడిద మల్లేష్,కల్వల జగన్, దాసరి శ్రీనివాస్, ఎలుక పెల్లి సురేష్, మాతంగి సాగర్, నూకల మొండి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలకు తక్షణ పరిష్కారం అవసరం

### - అక్రిడిటేషన్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించాలి.
### - ఐక్యతతో హక్కుల సాధన సాధ్యం -టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 9 : జర్నలిస్టులు సమిష్టిగా ఉండి తమ సమస్యలపై పోరాడితేనే హక్కులు సాధించగలరని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి. దయాసాగర్ అన్నారు. అక్రిడిటేషన్లు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, హెల్త్ కార్డులు వంటి ప్రాధాన్య అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎర్రం సతీష్ కుమార్ అధ్యక్షత వహించగా, దయాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు జీతభత్యాలు లేకుండా, 24 గంటలు ప్రజలకు మరియు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ జర్నలిస్టులు ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని, ఆరోగ్య భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు మరణించినప్పుడు మీడియా అకాడమీ నుంచి కేవలం లక్ష రూపాయలు మాత్రమే అందిస్తున్నారని, దానిని కనీసం ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేల పెన్షన్‌ను రూ.5 వేలుగా పెంచాలని కోరారు. ప్రభుత్వం జారీ చేసిన హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయకపోవడంతో అనేక మంది జర్నలిస్టులు వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం దీర్ఘకాలికంగా కృషి చేస్తోందని ఆయన చెప్పారు. ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛన్లు, మహిళా జర్నలిస్టులకు రాత్రి వేళల్లో రవాణా సౌకర్యం వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్ల దృష్టికి నిరంతరం తీసుకెళ్తున్నామని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు కొన్ని ప్రైవేట్ పాఠశాలలు



ఫీజు రాయితీలు ఇవ్వడం లేదని, అట్టి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతతో వ్యవహరించి స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఐక్యతతో పని చేస్తేనే సంఘం బలోపేతం అవుతుందని పిలుపునిచ్చారు. అనంతరం టిడబ్ల్యూజేఎఫ్ 2026 నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుజ్జ సారేశ్వరరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కొలుగూరి సంజీవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతల కుమార్ యాదవ్, గాదె రమేష్, రోంటాల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ములకల లక్ష్మారెడ్డి, కోశాధికారి మండల రాంబాబు, జాయింట్ సెక్రటరీ టి. దుర్గయ్య, సలహాదారు రమేష్, తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ప్రవీణ్ కుమార్, కార్యదర్శి కమలాకర్, కోశాధికారి భాస్కర్, మీడియా కన్వీనర్ పుల్ల సృజన్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రహీం పాషా, జోవర్ధన్, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

### - శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే చందర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 09 : రామగుండం విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముందు టివిఏఈజేఈసి పిలుపుమేరకు ఆర్టిజన్ల డిమాండ్ల సాధనకు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం రెండవ రోజుకు చేరింది. ఆర్టిజన్ కార్మికుల సమ్మె శిబిరాన్ని బిఆర్ఎస్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కార్మిక నాయకులు, జేఏసీ ఉమ్మడి జిల్లా కరీంనగర్ చైర్మన్ తూళ్ల నాగరాజు, టిజి ట్రాన్స్కో రాష్ట్ర కంపెనీ కార్యదర్శి హరి ప్రసాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వేణు మహేశ్వర్, యవర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పిరెడ్డి కిరణ్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల యజమాన్యం వెంటనే స్పందించి ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన ఉద్యమంలో భాగస్వాములు అవుతామని ప్రకటించారు. సమ్మె శిబిరంలో కొంకటి శ్రీనివాస్, వడ్డేపల్లి సురేష్, ఆవుల మహేష్, మాటూరి రవీందర్, మల్లారపు ప్రభాకర్, ఎస్.రవి, వర్మ, నాయక్, జీ.కిరణ్, సందీప్, కాటం రమేష్, శ్రీనాథ్, బోరి శ్రీనివాస్, జనార్ధన్, ప్రణయ్ శరత్, ఏ.కృష్ణ, ఎల్.శ్రీకృష్ణ, జ్యోతి, రవికుమార్, రమేష్, శ్రీనివాస్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల ఐక్యతే శక్తి..జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

### - పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
### - ఏప్రిల్ 23, 24న హైదరాబాద్‌లో జాతీయ మహాసభలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 9 : ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు నాల్గవ స్థంభంగా కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఐక్యతే వారి అసలైన శక్తి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు అందరూ ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా జాతీయ మహాసభల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఈ జాతీయ స్థాయి మహాసభలు జర్నలిస్టుల సమస్యలు, సవాళ్లు, భవిష్యత్ దిశపై చర్చించేందుకు కీలక వేదికగా నిలుస్తాయని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఒకే చోట చేరి తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా వృత్తి అభివృద్ధికి దోహదం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణకు ఇలాంటి సమావేశాలు మార్గదర్శకంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మాటి రవీందర్‌తో పాటు గట్టు రవీందర్, కడపక రవి, క్యాతం వెంకటేశ్వర్లు, మారుపెల్లి చంద్రమౌళి, రాచర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మీ చిన్న సమాచారం ఒక పెద్ద మార్పుకు పునాది

### - గంజాయి సమాచారానికి 5,000 బహుమతి
### - డ్రగ్స్‌పై కఠిన చర్యలకు మహబూబాబాద్ పోలీసుల పిలుపు
### - 8712656999 నెంబర్ కి సమాచారం ఇవ్వండి
### - జిల్లా ఎస్పీ డా.శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ యువత ఆరోగ్యం, భద్రత భవిష్యత్తును కాపాడటానికి గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ డా.శబరీష్ తెలిపారు. డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారి, నిశ్శబ్దంగా యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలను బలహీనపరుస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం మరియు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. బాధ్యత గల పౌరులు,యువజన నాయకులు,గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతి నిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరని ఆయన అన్నారు. గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించిన వారికి ?5,000 వరకు బహుమతి ఇవ్వబడుతుందని పోలీసులు ప్రకటించారు. సమాచారం ఇచ్చే వ్యక్తుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని కూడా స్పష్టం చేశారు. ప్రజలు తమ సమాచారం ఈ ప్రత్యేక మొబైల్ నంబర్ ద్వారా అందించవచ్చని తెలిపారు 871265 6999 మీ చిన్న సమాచారం ఒక పెద్ద మార్పును తీసుకురాగలదని, యువత భవిష్యత్తును కాపాడేందుకు అందరూ కలిసి పనిచేయాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

# పాడి గేదెల కోరకు ఆన్ లైన్ దరఖాస్తులు చేసుకోండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025-26 సంవత్సరానికి పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు తేది 08-04-2026 ముగియడంతో ప్రభుత్వం గడువు తేదిని 16-04-2026 వరకు పొడగించిందని కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ, యువకులు సంబంధిత కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆదార్ కార్డు, రేషన్ కార్డు,ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం), పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), తదితర ధృవ పత్రాలతో 16-04-2026 వరకు ఆన్ లైన్ (www. tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబంధిత ధృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), గ్రామీణ ప్రాంతం వారు సంబందిత ఎంపీడీఓ కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబందిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# టీపీసీసీ డాక్టర్ సెల్ జనరల్ సెక్రటరీగా డా.డి.వీరన్న నాయక్ నియామకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : టీపీసీసీ డాక్టర్ సెల్,మెడికల్ అండ్ హెల్త్ విభాగం జనరల్ సెక్రటరీగా డా.డి.వీరన్న నాయక్ నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర డాక్టర్ సెల్,మెడికల్ అండ్ హెల్త్ విభాగం చైర్మన్ డా.యం.రాజీవ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డా.వీరన్న నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ , టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. తన నియామకానికి సహకరించిన డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డా. జాటోతు రామచంద్రనాయక్,డీసీసీ ప్రెసిడెంట్ డా.ఉమా మురళీ నాయక్,మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్,మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.మురళి నాయక్ ,పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,మహబూబాబాద్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్ ,జిల్లా నాయకులు గార్లపాటి వెంకటరెడ్డి,నూకల వేణుగోపాల్ రెడ్డి,బాదావత్ రాము నాయక్,అంబటి వెంకటనారాయణ,కురవి మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర, నాయకులు దొంగల జనార్దన్ రెడ్డి,కొర్ని రవీందర్ రెడ్డి, లూనావత్ జ్యోతి కరుణాకర్,డోర్నకల్ నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొర్ని అనిల్, భూక్యా గోపా నాయక్, లూనావత్ విజయ్ నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని డా.వీరన్న నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.

# సిపిఐ బలోపేతానికి కృషి చేద్దాం

### - సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 09 : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబాబాద్ పట్టణ కార్యవర్గ సమావేశం 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్ అధ్యక్షతన గురు వారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి హాజరై మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోపార్టీ బలోపేతానికి కృషి చేద్దాం అన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ప్రజల పక్షాన పోరాడింది సిపిఐ అన్నారు ఈ ప్రాంతంలో ఇల్లు లేని నిరుపేదలకు ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ వేలాది మందికి ఇంటి స్థలాలు పంచింది సిపిఐ అన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం అనునిత్యం పోరాటం చేస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటంచేస్తూ అణగారిన వర్గాల కోసం పోరాటం సాగించామన్నారు పార్టీ బలోపేతానికి సభ్యత్వ సేకరణ పూర్తి చేయాలని మరియు పార్టీ కార్యక్రమాలను ప్రతి ఒక్క పార్టీ సభ్యుడు ప్రజల వద్దకు తీసుకుపోయి జయప్రదం చేయాలన్నారు. మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ సమస్యలపై గలమెత్తుతామన్నారు మున్సిపాలిటీ సమావేశాల్లో ప్రజల కోసం కౌన్సిలర్లుగా ప్రజల గొంతుక అయితామని అజయ్ సారధి రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ పట్టణ సహాయ కార్యదర్శులు 18 వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మామిండ్ల సాంబలక్ష్మి వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు








# ఆర్గానిక్ ఉత్పత్తులతో భద్రాచలంలో వినూత్న సేవలు

**- భద్రగిరి మార్ట్'కు మంచి స్పందన - ఐటీడీఏ పీఓ రాహుల్ - గిరిజన రైతులు, మహిళా సంఘాలకు ప్రత్యక్ష మార్కెట్ - త్వరలో హోమ్ డెలివరీ, కొత్త బ్రాంచీల ప్రణాళిక**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : వినియోగదారులకు నాణ్యమైన, కల్తీ లేని నిత్యవసర సరుకులను అందించడమే లక్ష్యంగా భద్రాచలంలో ఏర్పాటు చేసిన 'భద్రగిరి మార్ట్' అనూహ్య స్పందన పొందుతోందని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ తెలిపారు. గురువారం తన కార్యాలయం నుంచి భద్రగిరి మార్ట్‌లో జరుగుతున్న అమ్మకాలు, వినియోగదారుల స్పందనపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్గానిక్ పంటలు పండించే రైతులు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఈ), స్వయం సహాయక సంఘాల మహిళలు, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా అటవీ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తీసుకురావడానికి ఈ మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా గిరిజన రైతులు, మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా మార్ట్‌కు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం 70 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల మహిళలు, ఆర్గానిక్ రైతులకు ఇది ఉపాధి వనరుగా మారిందన్నారు. ప్రజల నుంచి ఆశించిన దానికంటే ఎక్కువ స్పందన వస్తోందని చెప్పారు. భద్రగిరి మార్ట్‌లో లభించే నిత్యవసర సరుకుల్లో సుమారు 99 శాతం గిరిజనుల నుంచే సేకరించబడుతున్నాయని, డిమాండ్‌ను బట్టి కొత్త ఉత్పత్తులను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సరుకుల నాణ్యత కోసం గ్రేడింగ్, ప్రత్యేక ప్యాకింగ్, డిజైనింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో సొరకాయ బుర్రలు, మట్టితో తయారుచేసిన వస్తువులు, ఆకులతో తయారుచేసిన ఇస్తరాకులు వంటి సంప్రదాయ ఉత్పత్తులను కూడా విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఒక నెలలో హోమ్ డెలివరీ సేవలు ప్రారంభించడానికి, మూడు నెలల్లో పాల్వంచ, ఖమ్మం ప్రాంతాల్లో కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు, పర్యాటకులు సులభంగా మార్ట్‌ను సందర్శించేలా దేవస్థానం పరిసరాల్లో, ముఖ్య కూడళ్లలో ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇదే సందర్భంగా భద్రాచలంలో మినీ స్టేడియం నిర్మాణానికి రూ. 2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అదనంగా రూ. 1.50 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నెల రోజుల్లో శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ఆదివాసీ కోయ సంస్కృతి పరిరక్షణలో భాగంగా గ్రంథావిష్కరణ, చర్చా గోష్టులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గిరిజన మ్యూజియంకు సందర్శకుల సంఖ్య పెరుగుతోందని, మరింత అభివృద్ధి కోసం రూ. 1 కోటి నిధులు విడుదలయ్యాయని, త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# రామవరం ప్రాంతానికి యుద్ధ ప్రాతిపదికన మంచి నీళ్లు అందించాలి

**- మిషన్ భగీరథ పట్ల అధికారులు అలసత్వాన్ని వీడాలి**

**- భగీరథ పనులను పరిశీలించిన సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, ప్రతినిధి బృందం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి కార్మిక కుటుంబాలు నివసించే రామవరం ప్రాంతంలో ఉన్న నీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మంచినీళ్లు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అధికారులను కోరారు. గురువారం రామవరంలోని కిన్నెరసాని, భగీరథ పనుల పైప్ లైన్లను, నూతన ట్యాంకులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రూ. 125 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని మంజూరు చేయించి, ప్రజలు మంచినీళ్లకు బాధపడొద్దని కృత నిశ్చయంతో చేసిన పనులు అధికారుల అలసత్వం వల్ల జాప్యం అవుతున్నాయని అన్నారు. తక్షణమే మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి నూతన ట్యాంక్ కి నీళ్లు ఎక్కించి రామవరంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు ఫోన్లో ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా సాయంత్రానికి నీళ్లు అందించాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అలాగే స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకొని మంచినీటి సరఫరా లో అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు .అలాగే పైప్ లైన్ జరుగుతున్న ప్రాంతాల్లో శిథిలమైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆయన ఆదేశించారు. పనులను పరిశీలించిన సిపిఐ ప్రతినిధి బృందంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య శ్రీనివాస్, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపి, త్రీ టౌన్ టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్, 14,16,17 వ డివిజన్ కార్పొరేటర్స్ సుధాకర్ రాజు, మునిగడప పద్మ, ఎర్రబెల్లి శంకర్, సీనియర్ నాయకులు మాటేటి గోపాల్, సర్పంచ్ నగేష్, రమేష్, అంకుష్ గంటాడి కోటేశ్వరరావు, ఖంపెల్లి దుర్గయ్య, నాగరాజు, శివ ,రాజు ,జగ్గు, చందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

**- కార్మికుల సమ్మెకు ప్రజా మద్దతు కూడగడతాం**

**- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మెచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలోని భజన మందిరం ఏరియాలో ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ ఆర్టిజన్లు ఒక కేటగిరీగా ఏర్పడినప్పటి నుండి వారికి ఎపిఎస్ఇబి రెగ్యులేషన్స్ వర్తింపజేయాలని, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆ కార్మికులు కోరుతున్నారనీ కానీ వీరి డిమాండ్లను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. అసలు ఆర్టిజన్ కార్మికులు అంటే ఎవరో నాకు తెలియదు అని ముఖ్యమంత్రి అనడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వారు ఎవరు తెలియదు అనడం వారి దాటివేత ధోరణికి నిదర్శనమని అన్నారు. కార్మికులు కేవలం తమ పర్మినెంట్ కోసమే కాకుండా విద్యుత్ సంస్థ మనుగడ కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ సంస్కరణల వలన విద్యుత్ సంస్థలు ప్రైవేటుపరం అయి కార్మికుల ఉద్యోగాలు కూడా పోయే ప్రమాదం ఏర్పడుతుందని దీనికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. న్యాయమైన సమస్యలపై ప్రారంభమైన ఆర్టిజన్ల సమ్మెకు మద్దతుగా నిలవాలని విద్యుత్ సంస్థలోని పర్మినెంట్ ఉద్యోగులకు , ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. అత్యంత కీలక రంగంలో, కీలక సమయంలో జరుగుతున్న ఈ సమ్మెలో ఒక కేటగిరీ కార్మికులకు వ్యతిరేకంగా ఇంకొక కేటగిరీ కార్మికులను ఎగదోసే యాజమాన్య ఎత్తుగడలను విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమ్మెను విచ్చిన్నం చేయడానికి ప్రభుత్వం అనేక రకాల కుట్రలు అనే అవకాశం ఉందని వీటిని కార్మికులు చైతన్యవంతంగా ఐక్యతతో తిప్పికొట్టాలని ఆయన అన్నారు. గతంలోలాగే ఆర్టిజన్ల స్థానంలో శాశ్వత ఉద్యోగులకు డ్యూటీలు వేసే ప్రమాదమున్నది. ఇప్పటికే ఆ ప్రయత్నాలు ప్రారంభమైనాయనీ అన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ రంగంలోని ఉద్యోగులందరూ మరింత ఐక్యతతో యాజమాన్య ఎత్తుగడలను ఎదుర్కోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకం కూడా విద్యుత్ ఆర్టిజన్ల న్యాయమైన సమ్మెను ఆదరించాలని, వారికి మద్దతుగా నిలవాలని కోరారు. సమ్మె విజయవంతం అయ్యేవరకు సిపిఎం కార్మికులకు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నాయకులు జునుమాల నగేష్, నాగకృష్ణ, ఇరవై ఒకటవ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, నాయకులు గండమాల భాస్కర్, శ్రీకాంత్, చింతలపూడి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.


# కొత్తగూడెంలో హెచ్ఐవి/ఎయిడ్స్ అవగాహన కోసం భారీ ర్యాలీ

**- ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా నిర్వహణ.**

**- ఉచిత పరీక్షలు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్‌వో స్పష్టం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 9 : ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కొత్తగూడెం పాత ఆర్టీసీ డిపో నుంచి ప్రారంభమై రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. విద్యార్థులు నినాదాలు చేస్తూ, సమాచార ఫలకాలను ప్రదర్శిస్తూ హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం రైల్వే స్టేషన్‌లో జరిగిన సమావేశంలో డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్‌తో పాటు హెపటైటిస్-బి, హెపటైటిస్-సి వంటి వ్యాధులపై అవగాహన అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ హెచ్ఐవి స్థితిని తెలుసుకోవాలని, ముఖ్యంగా వివాహానికి ముందు స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని ఆయన నొక్కి చెప్పారు. జిల్లాలోని పిహెచ్‌సీలు, యూపిహెచ్‌సీలు, సిహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నర్సింగ్ కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు చెప్పారు. అలాగే జీజీహెచ్‌లో




ట్రాన్స్‌జెండర్ల కోసం 'మైత్రి క్లినిక్‌లు' నిర్వహిస్తున్నామని, జిల్లాలోని జైళ్లలో హెచ్ఐవి, హెపటైటిస్ పరీక్షలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.డి.ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్‌తో ముడిపడి ఉన్న కళంకం, వివక్షను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువతలో అవగాహన పెంపొందించి సమాజంలో చైతన్యం కలిగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పిహెచ్‌సీ, యూపిహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయింపు**

**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రేగొండ, ఏప్రిల్ 9 : భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో గురువారం రోంటాల రఘుపతికి చెందిన నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు వరంగా నిలుస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. భద్రతతో కూడిన నివాసం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రఘుపతి కుమారుడి పుట్టిన రోజు వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి నివారణలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానం

**అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, ఏప్రిల్ 9 : హెచ్ఐవి నివారణలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నదని జిల్లా అడిషనల్ డిఏంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగ్రతి పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య అధికారుల అధ్యర్యంలో గురువారం ఖమ్మం లకారం...ట్యాంక్ బండ్ వద్ద హెచ్ఐవి ఎయిడ్స్ అవగా హన కార్యక్రమం ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ చందు నాయక్ అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, ఆపా ప్లస్ సిఎస్సి 2.0, వైఆర్జికె లింక్ వర్కర్ లు, ఎయిడ్స్ కార్యక్రమంలో పని చేసే ఉద్యోగులు, ఏఆర్టీ కేంద్రం సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, తదితరులు సుమారుగా 250 మంది పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ, హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని.. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇంకా ముందు అనేక నియంత్రణ కార్యక్రమాలు కొనసాగిస్తామని, దీనికోసం అందరి సహకారం అవసరమని తెలిపారు. అనంతరం ర్యాలీ మమత రోడ్ నందు సుమారు రెండు కిలో మీటర్లు కళాశాల నర్సింగ్ విద్యార్థినులతో నిర్వహించారు.

# హెచ్ఐవి నివారణలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానం

**అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఖమ్మం, ఏప్రిల్ 9 : హెచ్ఐవి నివారణలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నదని జిల్లా అడిషనల్ డిఏంహెచ్ఓ డాక్టర్ చందు నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగ్రతి పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య అధికారుల అధ్యర్యంలో గురువారం ఖమ్మం లకారం...ట్యాంక్ బండ్ వద్ద హెచ్ఐవి ఎయిడ్స్ అవగా హన కార్యక్రమం ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ చందు నాయక్ అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, ఆపా ప్లస్ సిఎస్సి 2.0, వైఆర్జికె లింక్ వర్కర్లు, ఎయిడ్స్ కార్యక్రమంలో పని చేసే ఉద్యోగులు, ఏఆర్టీ కేంద్రం సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, తదితరులు సుమారుగా 250 మంది పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ, హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని.. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇంకా ముందు అనేక నియంత్రణ కార్యక్రమాలు కొనసాగిస్తామని, దీనికోసం అందరి సహకారం అవసరమని తెలిపారు. అనంతరం ర్యాలీ మమత రోడ్ నందు సుమారు రెండు కిలో మీటర్లు కళాశాల నర్సింగ్ విద్యార్థినులతో నిర్వహించారు.

# మంగ్యా తండా స్కూల్లో సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

**ఎస్.జీ.ఎఫ్. ఆధ్వర్యంలో టైలు బెల్టులు బ్యాడ్జీలు పంపిణీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, ఏప్రిల్ 9 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మంగ్యా తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం శ్రీ సరస్వతీదేవి అమ్మ వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గతంలో ఈ పాఠశాలలో పనిచేసి, అకాల మరణం చెందిన టీచర్ ఉమారాణి జ్ఞాపకార్థం ఆమె భర్త కరుణాకర్ రెడ్డి మంగ్యా తండా పాఠశాలలో కృష్ణశిలతో చేసిన శ్రీసరస్వతి అమ్మ వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, టేకులపల్లి ఎంఈఓ జగన్, సర్పంచ్ తారా చంద్,కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఎస్జీ ఎఫ్ ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టులు, టైలు, బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల హెచ్ఎం మంగూలాల్, టీచర్ వీరన్నల సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ చైతన్య, సిఆర్పి అబ్బయ్య,ఎస్జిఎఫ్ మెంబర్ నాగభూషణం, ఎండీఎం వర్కర్ అమ్లీ, స్వచ్ఛమిత్ర జ్యోతి, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాడి గేదెల పెంపకం పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

**ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 9 : ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 సంవత్సరానికి గాను జిల్లాలో అమలు చేస్తున్న 2 పాడి గేదెల పెంపకం పథకం ఆన్లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 16 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు నవీన్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ˆస్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా (ఇంటర్నెట్/మీసేవ కేంద్రాల ద్వారా) ఆన్లైన్‌లో సమర్పించాలని, ఆన్లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు సంబంధిత మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో తమ దరఖాస్తులను ఏప్రిల్ 16 లోపు సంబంధిత పత్రాలు జతచేసి సమర్పించాలని సూచించారు. గడువులోగా సమర్పించని దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని, జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు ఆ ప్రకటనలో కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com